ప్రజాశక్తి

బుధవారం 8 అక్టోబర్ 2025 | 8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా



ఐలు ఆధ్వర్యాన విజయవాడలోని సివిల్ కోర్టుల వద్ద నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

న్యాయవాదుల నిరసన

- సిజెఐపై దాడికి యత్నంపై ఆగ్రహం
- ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లాల్లో విధుల బహిష్కరణ

దేశ అత్యున్నత కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయిపై దాడికి ప్రయత్నించడాన్ని ఖండిస్తూ మంగళవారం ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లాల్లో న్యాయవాదులు నిరసన తెలిపారు. తమ విధులను బహిష్కరించారు. బార్ అసోసియేషన్, ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) ఆధ్వర్యాన విజయవాడ, జగ్గయ్యపేట, నందిగామ, తిరువూరుల్లో న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. అనంతరం ర్యాలీలు నిర్వహించి ఆందోళన చేపట్టారు. విజయవాడలో కోర్టుల భవనం నుండి అంబేద్కర్ స్మృతివనం వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. అనంతరం కలెక్టరేట్లో వినతిపత్రం అందజేశారు. మచిలీపట్నంలోని జిల్లా కోర్టు ప్రాంగణంలో న్యాయ దేవత ప్రతిమ ఎదుట నిరసన తెలిపారు. అలాగే సిపిఎం, పలు ప్రజా సంఘాల ఆధ్వర్యాన పలుచోట్ల నిరసన ప్రదర్శనలు నిర్వహించారు.

(పూర్తి వివరాలు లోపలి పేజీల్లో)



మచిలీపట్నంలో జిల్లా కోర్టు వద్ద నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

చర్చ జరిగేనా...!?

- నేడు విఎంసి కౌన్సిల్
- ఇరకాటంలో వైసిపి
- కూటమి ప్రభుత్వ వత్తిడితో అజెండాలోకి రోడ్ల ప్రైవేటీకరణ ప్రతిపాదన

ప్రజాశక్తి - విజయవాడ : నగరపాలక సంస్థ సాధారణ సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 10.30 గంటలకు మేయర్ రాయన భాగ్యలక్ష్మి అధ్యక్షతన జరుగుతుంది. గత నెల 16న జరగాల్సిన ఈ సమావేశం... మూడు వారాల తర్వాత నిర్వహిస్తున్నారు. గత నెలలో న్యూ రాజరాజేశ్వరిపేటలో అతిసార విజృంభించి నలుగురు మరణించడమే కాకుండా వందలాది మంది ఆస్పత్రుల పాలైన విషయం తెలిసిందే. ఈ సంఘటన నేపథ్యంలోనే కౌన్సిల్ సమావేశాన్ని అప్పట్లో వాయిదా వేసినట్లు మేయర్ ప్రకటించారు. ఎట్టకేలకు బుధవారం జరిగే ఈ కౌన్సిల్ సమావేశపు ఎజెండా 159 ప్రతిపాదనలు, మరో 19 ప్రశ్నలతో రూపుదిద్దుకుంది. సమావేశం జరిగే సమయంలో 88కె (అత్యవసర అంశం) కింద మరికొన్ని అంశాలు వచ్చే అవకాశం ఉంది. అజెండాను మూడు వారాల క్రితమే సభ్యులకు, అధికారులకు పంపిణీ చేశారు. అజెండాపై కౌన్సిల్‌లో అనుసరించాల్సిన వ్యూహ ప్రతివ్యూహాలపై ఏ పార్టీకాపార్టీ విడివిడిగా సభ్యులతో చర్చించి, తీవ్ర కసరత్తు చేశాయి. అజెండాలోని ఆయా అంశాలపై సభ్యులడిగే ప్రశ్నలకు సరైన సమాధానాలు చెప్పే విధంగా, అలాగే సమావేశం సాఫీగా జరిగేందుకు వీలుగా అన్ని విధాలుగా సంసిద్ధంగా ఉండాలని ఆయా విభాగాల ఉన్నతాధికారులతో మేయర్ రాయన భాగ్యలక్ష్మి మంగళవారం తన చాంబర్లో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో దిశానిర్దేశం చేశారు. అలాగే విఎంసి కమిషనర్ కూడా అధికారులకు పలు సూచనలు చేశారు.

వైసిపికి సంకట స్థితి

గత కొంతకాలంగా కౌన్సిల్‌లో అధికార పక్షమైన వైసిపి సంకట స్థితిని ఎదుర్కొంటోంది. కౌన్సిల్‌లో టిడిపి ప్రతిపక్షంగా ఉన్నా ఆపార్టీ కలిసి ఉన్న కూటమి ప్రభుత్వం... రాష్ట్రంలో అధికారం చెలాయిస్తోంది. ప్రభుత్వం చేస్తున్న దిశానిర్దేశంతో విఎంసిలో అనేక ప్రజావ్యతిరేక, ప్రజలకు భారమైన అంశాలను టిడిపి తీసుకొస్తోంది. విఎంసికి సంబంధించిన విలువైన ఆస్తులు, ప్రజాసందకు సంబంధించిన వాటిని ప్రయివేటు వ్యక్తులకు కట్టబెట్టే ప్రతిపాదనలు తీసుకొస్తున్న క్రమంలో వైసిపి సంకట స్థితిని ఎదుర్కొంటోంది. ప్రజలకు భారమైన ఇటువంటి అంశాలను ఆమోదిస్తే లేదా వ్యతిరేకిస్తే జరగబోయే పరిణామాలను తట్టుకొని నిలబడగలుగుతామా అనే ఒక రకమైన క్లిష్టమైన పరిస్థితులను వైసిపి ఎదుర్కొంటోంది. స్థానికంగా వైసిపి, టిడిపి మధ్య లోపాయికారి ఒప్పందాల కారణంగా మేయర్‌ను తొలగించలేదనే చర్చ లేకపోలేదు. రాష్ట్రవ్యాప్తంగా పలు మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో కూటమి ప్రభుత్వ చర్యలతో పాలకవర్గాల మార్పు జరిగింది. ఈక్రమంలో ప్రతి కౌన్సిల్ సమావేశం... ప్రధానంగా నగర మేయర్‌కు అగ్ని పరీక్షలా తయారైంది. నగరంలోని అత్యంత ముఖ్యమైన 19 రహదారులను 23.54 కిలోమీటర్ల పొడవున కాపెక్స్ కాస్ట్ (మూలధనం వ్యయం) కింద రూ.32 కోట్లు, అలాగే పదేళ్ల కాలానికి ఏడాదికి రూ.12 కోట్లు ఒఅండ్ఎం కింద సాధారణ నిధుల నుంచి చెల్లించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చిన ఐదో అంశంపై బుధవారం జరిగే సమావేశంలో అధికార వైసిపి ఏ విధమైన నిర్ణయం తీసుకోబోతోందనే చర్చ జరుగుతోంది. ప్రభుత్వ వైద్యకళాశాలల ప్రయివేటీకరణకు పూనుకున్న కూటమి ప్రభుత్వ చర్యను నిరసిస్తూ రాష్ట్రంలోని ప్రధాన ప్రతిపక్షం వైసిపి ఆయా జిల్లాల్లో ఆందోళనలు



నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో రోడ్ల ప్రయివేటీకరణ విషయంలో స్థానిక వైసిపి ఏం నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి. రోడ్ల ప్రయివేటీకరణ విధానాన్ని సిపిఎం ఆది నుంచి వ్యతిరేకిస్తోంది. ప్రస్తుతం జరిగే సమావేశం చేసిన ప్రతిపాదనను కూడా వ్యతిరేకిస్తోంది. అతిసార నివారణకు చర్యలు తీసుకునే దగ్గర నుంచి నిధులు కేటాయింపు వరకు కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని వైసిపి అధినాయకత్వం తీవ్రంగా విమర్శిస్తోంది. అతిసార నివారణకు అన్ని రకాలుగా సుమారు రూ.15 కోట్లకు పైగానే విఎంసి ఖర్చు చేస్తే ...దానిలో రాష్ట్ర ప్రభుత్వం ఒక్క పైసా కూడా ఇవ్వలేదు. మంత్రులు నారాయణ, సత్యకుమార్, సుభాష్ తదితరులు న్యూ ఆర్ఆర్‌పేటలో అతిసార బాధితులను పరామర్శించారే తప్ప నిధుల అంశంలో నోరుకూడా మెదపలేదు. ఈ నిధుల అంశంతోపాటు అతిసారకు దారి తీసిన పరిస్తితులపై కౌన్సిల్‌ను వేదికగా చేసుకొని టిడిపిని లక్ష్యంగా చేసుకోవాలని వైసిపి ప్రయత్నిస్తోంది. దసరా ఉత్సవాల ఖర్చు కూడా విఎంసిపై తీవ్రమైన ప్రభావం చూపుతోంది. నిండుకున్న ఖజానా, ఎదురుచూస్తున్న అభివృద్ధి పనులు, ఏళ్ల తరబడి ప్రారంభోత్సవానికి నోచుకోని టిడ్కో, జెఎన్ఎన్‌యుఆర్ఎం గృహాలు, వివిధ గ్రాంట్ల రూపంలో రూ.645 కోట్ల రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు తదితర అంశాలపై వైసిపి చర్చకు పెట్టి టిడిపిని ఇరకాటంలోకి నెడుతుందో లేక ఏ విధమైన చర్చ లేకుండానే తూతూ మంత్రంగా కౌన్సిల్‌ను నిర్వహిస్తుందో

ప్రజాస్వామ్య పద్ధతిలో కౌన్సిల్ నిర్వహించాలి : సిపిఎం

వార్త 4లో

నకిలీ మద్యంపై మహిళల నిరసన

- సీసాలను పగులగొట్టి ధర్నా
- గోడౌన్ పరిశీలన
- సిట్టింగ్ జడ్జితో విచారించాలని సిపిఎం, ఐద్వా, సిఐటియు నేతల డిమాండ్



గోడౌన్‌ను పరిశీలిస్తున్న సిపిఎం, ఐద్వా, సిఐటియు నేతలు సిహెచ్.బాబురావు, ఎన్.సిహెచ్.శ్రీనివాస్, కె.సరోజ

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : నకిలీ, కల్తీ మద్యం కుంభకోణంపై న్యాయ విచారణ జరిపించాలని, దోషులను కఠినంగా శిక్షించాలని, ఈ ప్రాంతవాసులకు బూడిద కలిసిన నీరు కాకుండా స్వచ్ఛమైన మంచినీరు అందించాలని కోరుతూ మంగళవారం ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్లో సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. మద్యం సీసాలను పగలగొట్టి మహిళలు కూటమి ప్రభుత్వంపై నిరసన తెలిపారు. కూటమి ప్రభుత్వ తీరుపై మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. నకిలీ, కల్తీ మద్యం తయారు చేసిన గోడౌన్ ప్రాంతాన్ని బాబురావుతోపాటు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎన్.సిహెచ్.శ్రీనివాస్, ఐద్వా జిల్లా కార్యదర్శి కాజ సరోజ, సిపిఎం కొండపల్లి పట్టణ కార్యదర్శి మహేష్, సీనియర్ నేత విఠల్‌రావు తదితరులు పరిశీలించారు. ఈసందర్భంగా బాబురావు, నేతలు మాట్లాడుతూ మద్యాన్ని దశలవారీగా నియంత్రిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి పాలనలో మద్యం ఏరులై పారుతోందన్నారు. స్వచ్ఛమైన మంచినీరు మాత్రం లభించటం లేదన్నారు. ఎన్‌టిటిపిఎస్ ప్లాంట్ బూడిద కలవడంతో కొండపల్లి మున్సిపాలిటీలో మంచినీటి సరఫరా నిలిచిపోయిందన్నారు. గత వైసిపి పాలనలో సరఫరా చేసిన మద్యంతో ప్రజల ఆరోగ్యాలు దెబ్బతిన్నాయని, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడతామని చెప్పి అధికారంలోకి

(మిగతా 2లో)

స్వచ్ఛాంధ్రను మరింత ముందుకు తీసుకెళతాం

- స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్
- కలెక్టర్ లక్ష్మీశ, సిపి రాజశేఖరబాబు చేతుల మీదుగా జిల్లాస్థాయి పురస్కారాలు ప్రదానం

ప్రజాశక్తి - విజయవాడ : రాష్ట్రంలోని గ్రామాలు, పట్టణాల్లో స్వచ్ఛ సేవక్ దళాల ఏర్పాటుకు కృషి చేయనున్నట్లు రాష్ట్ర స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ తెలిపారు. నగరంలోని తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో జిల్లాస్థాయి స్వచ్ఛాంధ్ర పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో తొలుత అతిథులు.. స్వచ్ఛతా వారియర్స్‌తో కలిసి మహాత్మాగాంధీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. పట్టాభిరామ్‌తోపాటు కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ ఎస్‌వీ రాజశేఖరబాబు, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర తదితరులతో కలిసి 50 మంది విజేతలకు పురస్కారాలు అందజేశారు. ఈసందర్భంగా పట్టాభిరామ్ మాట్లాడుతూ సమష్టి కృషితో స్వచ్ఛాంధ్ర ఉద్యమాన్ని ముందుకుతీసుకెళతామన్నారు. కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ అధికారులు, ప్రజలు, ప్రజాప్రతినిధుల సమష్టి కషితో జిల్లా స్వచ్ఛాంధ్రలో ముందంజలో నిలిచిందన్నారు. సిపి ఎస్‌వి రాజశేఖర్‌బాబు మాట్లాడుతూ శానిటేషన్ నిర్వహణలో డ్రోన్, ఏఐ సాంకేతికత అనుసంధానంతో మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ



పురస్కారాల ప్రదానంలో కె.పట్టాభిరామ్, కలెక్టర్ లక్ష్మీశ, సిపి రాజశేఖరబాబు

(మిగతా 2లో)

మాజీ ఐఎఎస్ అధికారి శంకరన్‌కు పలువురు నేతల నివాళి

విజయవాడ : ఐఎఎస్ అధికారిగా పేదల సమస్యలను పరిష్కరించేందుకు నిత్యం పరితపించిన మానవతావాది ఎస్.ఆర్. శంకరన్ అధికారులకు, ఉద్యమకారులకు ఆదర్శప్రాయులని మాజీ ఎంఎల్‌సి జల్లి విల్సన్ అన్నారు. మాజీ ఐఎఎస్ అధికారి శంకరన్ 15వ వర్ధంతి సందర్భంగా మంగళవారం విజయవాడ ఐక్యతాభవన్లో గల ఆయన కాంస్య విగ్రహానికి జల్లి విల్సన్ పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం విల్సన్ మాట్లాడుతూ ఐఎఎస్ అధికారిగా విధులు నిర్వహించినంతకాలం నిజమైన సంక్షేమం గురించి నిరంతరం ఆలోచించిన శంకరన్ అనేక చట్టాలను రూపొందించడంలో రాజకీయనాయకులను, ముఖ్యమంత్రులను సైతం ఒప్పించగలిగారని, అస్పృస్యతా నివారణ చట్టం, ఎస్‌సి, ఎస్‌టి అచ్యాచారాల నివారణ చట్టం, భూ సంస్కరణలు, అసైన్డ్‌మెంట్ చట్టాలు, గ్రామీణ ఉపాధి చట్టం, అటవీ హక్కుల చట్టం వంటి ఎన్నో చట్టాలను సమర్ధవంతంగా రూపొందించారని కోట్లాది మంది పేదలకు అండగా నిలిచారని కొనియాడారు. శంకరన్ స్ఫూర్తితో చైతన్యంకావాలని పిలుపునిచ్చారు. దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బుట్టి రాయప్ప, నగర అధ్యఉలు సంగుల పేరయ్య, హెల్ప్ ది హోమ్‌లెస్ వ్యవస్థాపక అధ్యక్షులు ఈదులూరి రాధాకృష్ణ, కూరాకుల స్టాలిన్, కాళ్ల ప్రకాశరావు, ఐక్యతా భవన్ అధికారులు, సిబ్బంది పాల్గొని నివాళులర్పించారు.



కళాశాల భవనం పైనుండి దూకిన విద్యార్థి

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ (విజయవాడ అర్బన్) : నగరంలోని ఎస్ఆర్ఆర్ అండ్ సివిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల బికాం (జనరల్) ఫైనల్ ఇయర్ విద్యార్థి రవి మంగళవారం కళాశాలలోనే ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో రెండో అంతస్తు నుంచి కిందికి దూకిన విద్యార్థి రవి తీవ్రంగా గాయపడ్డాడు. కళాశాల అధ్యాపకులు, సహచర విద్యార్థులు హుటాహుటిన అతడిని 108 వాహనంలో కొత్త ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ ఆపరేషన్‌కు అవసరమైన సదుపాయాలు అందుబాటులో లేవని ఆస్పత్రి వైద్యులు చెప్పడంతో ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కళాశాల అధ్యాపకుడి వేధింపులతోనే తాను ఆత్మహత్యా యత్నానికి పాల్పడినట్లు రవి ఆరోపిస్తున్నాడు. ఘటన అనంతరం కళాశాలలో మధ్యాహ్నం నుంచి జరగాల్సిన సైన్స్ గ్రూపు తరగతుల రద్దు చేసి విద్యార్థులను ఇళ్లకు పంపివేశారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

12 మందిపై కేసు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఎన్టీఆర్ జిల్లా మైలవరం నియోజకవర్గం ఇబ్రహీంపట్నంలో బట్టబయలైన నకిలీ మద్యం కేసుకు సంబంధించి 12 మందిని ఎక్సైజ్ అధికారులు నిందితులుగా చేర్చారు. ఏ1గా జనార్ధన్‌రావు, ఏ2 జగన్‌మోహన్‌రావు, ఏ3 బాలాజీ, ఏ4 రవి, ఏ5 సయ్యద్ హాజీ, ఏ6 కట్టా రాజు, ఏ7 దాసు, ఏ8 ప్రదీప్ దాస్, ఏ9 దాస్, ఏ10 అనంత దాస్, ఏ11 శ్రీనివాస్, ఏ12గా కల్యాణ్‌పై భవానీపురం ఎక్సైజ్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆహ్లాదకరంగా సినీ సంగీత విభావరి

ప్రజాశక్తి - విజయవాడ : అనిత ఆర్ట్స్ (పాట పాడుదాం సీజన్ 3) ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి గాంధీనగర్ ఆశిష్ ఆడిటోరియంలో తెలుగు సినీ సంగీత విభావరి ఆహ్లాదంగా జరిగింది. ప్రముఖ ఔత్సాహిక గాయనీ గాయకులు పవన్ కుమార్ (ప్రధాన నిర్వాహకులు), టి.శ్రీనివాసరెడ్డి, వి.వి.రావు, వెంకటేష్, వి.కామేశ్వరి, సీతాదేవి, సుమలత, రామకష్ణ తదితరులు వివిధ సినిమాల్లోని సోలో, డ్యూయెట్ పాటలు పాడి ప్రేక్షకులను అలరించారు. ఈ కార్యక్రమానికి ప్రసాదరెడ్డి వ్యాఖ్యతగా వ్యవహరించారు. ప్రేక్షకులు గణనీయంగా పాల్గొన్నారు.



నకిలీ మద్యంపై మహిళల నిరసన

(మొదటి పేజీ తరువాయి)

వచ్చిన కూటమి పాలన అదే దారిలో సాగుతోందని అన్నారు. బెల్ట్ షాపుల ద్వారా మద్యం విచ్చలవిడిగా అమ్మకాలు సాగుతున్నాయని అన్నారు. కూటమి ప్రభుత్వం వీటికి నైతిక బాధ్యత వహించాలని, ముఖ్యమంత్రి స్పందించాలని డిమాండ్ చేశారు. కొద్ది మంది నేతలను సస్పెండ్ చేసి సరిపెట్టుకోవటం కాదని, 15 నెలలుగా ఈ దందా సాగుతున్నా ప్రభుత్వం ఎందుకు కళ్ళు మూసుకుందని ప్రశ్నించారు. ప్రభుత్వ పెద్దలు, ప్రభుత్వ యంత్రాంగం అండలేకుండా ఇంత పెద్దఎత్తున నకిలీ మద్యం పరిశ్రమలాగా నడపడం సాధ్యంకాదన్నారు. ఈ వ్యవహారంలో పాత్రదారులు, సూత్రధారులు ఎవరో తేల్చాలని డిమాండ్ చేశారు. తక్షణమే మంచినీటి సరఫరా పునరుద్ధరించాలని, నకిలీ మద్యం దందా నుండి ప్రజలను కాపాడాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో సిపిఎం, ప్రజా సంఘాల నేతలు కొండల రావు, బేబీ సరోజినీ, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్రను మరింత ముందుకు తీసుకెళతాం...

(మొదటి పేజీ తరువాయి)

అత్యుత్తమ విధానాలను పరస్పరం తెలుసుకొని అమలుచేసేందుకు కూడా ఈ అవార్డులు దోహదం చేస్తాయన్నారు. గ్రీన్ అంబాసిడర్లు బి.భూషణం, బి.సామ్రాజ్యం, శంకర్ తమ మనోగతాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిసిపి కేజీవీ సరిత, జడ్పీ సీఈవో కె.కన్నమనాయుడు, డిపిఒ పి.లావణ్యకుమారి, విజయవాడ, నందిగామ, తిరువూరు ఆర్‌డిఒలు కావూరి చైతన్య, కె.బాలకష్ణ, కె.మాధురి, పురస్కార విజేతలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



కృష్ణాజిల్లా డిఎంహెచ్‌ఒగా యుగంధర్

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) : కృష్ణాజిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారిగా డాక్టర్ పి.యుగంధర్‌ను నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం అనంతపురం జిల్లాలో ఇమ్యునైజేషన్ అధికారిగా విధులు నిర్వర్తిస్తున్న యుగంధర్‌కు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా ఉద్యోగోన్నతి కల్పించి కృష్ణాజిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారిగా ప్రభుత్వం నియమించింది.

గృహ నిర్మాణాలపై నిర్లక్ష్యం వద్దు : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): జిల్లాలోని గృహ నిర్మాణాల పురోగతిపై నిర్లక్ష్యాన్ని సహించేది లేదని, నిర్మాణాలను వేగవంతం చేసి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ సమావేశపు మందిరంలో సహాయ కలెక్టర్ ఫర్హీన్ జాహిద్ తో కలిసి గీహ నిర్మాణ పురోగతిపై ఎంపీడీవోలు, గృహ నిర్మాణ సంస్థ ఇంజనీర్లతో మండలాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గహ నిర్మాణాల పురోగతి ఆశించిన స్థాయిలో లేదని అసంతప్తి వ్యక్తం చేస్తూ, నెలకు కేవలం 2 లేదా 3 మాత్రమే పూర్తి చేస్తున్నారని ఇది ఎంత మాత్రం సరైనది కాదన్నారు. వచ్చే మార్చి 31వ తేదీ లోపు నిర్మాణాలను పూర్తి చేస్తేనే లబ్ధిదారులకు బిల్లులు చెల్లింపులు జరుగుతాయని, ఆ లోపుగా పూర్తి చేయకపోతే పథకం ముగింపు అవుతుందని ప్రత్యేక దష్టి పెట్టాలన్నారు. కాంట్రాక్టర్లు, లబ్ధిదారులతో సమావేశాలు నిర్వహించి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయడానికి కషి చేయాలని, అదేవిధంగా ప్రభుత్వం బీసీ ఎస్సీ ఎస్టీ వర్గాల లబ్ధిదారులకు అదనపు ఆర్థిక సహాయం అందిస్తున్న సంగతిని వివరించాలన్నారు. వెలుగు పథకం కింద కూడా అవసరమైన వారికి రుణాలు అందిస్తారని సద్వినియోగం చేసుకునే విధంగా అవగాహన కలిగించాలన్నారు. జిల్లాలోని కొన్ని లేఔట్లను మెరక చేయవలసిన అవసరం ఉందని, దానివల్ల లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకోవడానికి ముందుకు రావడం లేదని అధికారులు కలెక్టర్ దష్టికి తీసుకురాగా, అలాంటి సమస్యలు ఉన్న లేఅవుట్ల వివరాలను నియోజకవర్గాలవారీగా అందించాలని అధికారులకు సూచించారు. ఈనెల 21వ తేదీన పురోగతిపై మరల సమీక్షిస్తామని, ఆ లోపుగా వివిధ దశల్లో ఉన్న గహ నిర్మాణాలను ముందుకు తీసుకువెళ్లి పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో గహ నిర్మాణ సంస్థ కార్య నిర్వహణ అధికారి బుజ్జి బాబు, డిఆర్డిఏ, మెప్మా పీడీలు హరిహరనాథ్, సాయిబాబు, జెడ్పి డిప్యూటీ సీఈవో ఆనంద కుమార్, పశుసంవర్ధక శాఖ అధికారి చిన్న నరసింహులు, మార్ఫెడ్ డిఎం మురళీ కిషోర్, మార్కెటింగ్ ఎడి నిత్యానంద్ తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి పోటీలకు కెకెఆర్ గౌతమ్ విద్యార్థి

ప్రజాశక్తి-గుడివాడ

ఇటీవల నూజివీడులో జరిగిన ఉమ్మడి కృష్ణాజిల్లా ఎస్‌జిఎఫ్ ఆధ్వర్యంలో అండర్-14 రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ సెలక్షన్‌లో కెకెఆర్ గౌతమ్ స్కూల్ విద్యార్థిని ఎజి నవికరక్ష అద్భుతమైన ప్రదర్శన కనబరిచి రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటిలకు ఎంపికైనట్లు స్కూల్ ప్రిన్సిపల్ పి.లక్ష్మీప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అద్భుతమైన అట తీరును కనబరిచిన నవికరక్షను, కోచ్ మడక సత్యఅన్వేష్‌లను పాఠశాల ఆవరణలో పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్స్ సత్యారామ్, జ్యోతి, ప్రశాంతి, తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు

ప్రజాశక్తి-మొవ్వ

మొవ్వ మండలం కూచిపూడిలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన గాలికుంటు వ్యాధి నివారణటీకాలు 99 పశువులకు సిబ్బంది వేశారని మండల పశువర్ధకశాఖ అధికారి డాక్టర్ మౌర్యసత్యేంద్ర తెలిపారు. సచివాలయాల ఎహెచ్ కంచర్ల శ్రీనివాసరావు (కూచిపూడి), నరేంద్ర (అయ్యంకి), అజయ్, జేవివో వెంకటయ్య, విఎల్‌వో రామకృష్ణ, తాతబ్బాయిలు పాడి రైతుల ఇళ్ల వద్ద ఈ టీకాలు వేశారు.

ఆటల పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-ఉంగుటూరు: మండల స్థాయి 69వ బాలబాలికల ఆటల పోటీలు మంగళవారం ఉంగుటూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ప్రారంభమయ్యాయి. పోటీలను మండల విద్యాశాఖ అధికారి జె.సాంబశివరావు, ఉంగుటూరు గ్రామ సర్పంచ్ కాటూరి వరప్రసాద్, ఎస్ఎంసి చైర్మన్ పి.శ్రీనివాసరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్.అనిత, వ్యాయామ ఉపాధ్యాయురాలు ఎస్.కాంతి లాంఛనంగా ప్రారంబించారు. మండలంలోని తేలప్రోలు, వెల్దిపాడు, పొట్టిపాడు, ఆత్కూరు, మానికొండ, తరిగొప్పల,



పెద్ద ఆవుటపల్లి గ్రామాలకు చెందిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు, విద్యార్థినులు పాల్గొన్నారు. మంగళవారం క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, షటిల్ కాక్, బ్యాడ్మింటన్, చెస్ పోటీలు నిర్వహించారు.

జిఎస్‌టి సేవింగ్స్‌పై అవగాహన

ప్రజాశక్తి-పామర్రు: పామర్రు శ్రీనివాస విద్యాసంస్థలలో విద్యార్థులకు జీఎస్టీ ఛాంపియన్స్ ఆధ్వర్యంలో మంగళవారం సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ ప్రత్యేక ప్రచార కార్యక్రమం జరిగింది. ఈ ప్రచారం వచ్చే నెల 19వ తేదీ వరకు కొనసాగనుందని జీఎస్టీ ఛాంపియన్లు స్వాతి, రాజేశ్వరి తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు, ప్రజలకు, వినియోగదారులకు జిఎస్‌టి సంస్కరణల ప్రయోజనాల పట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస విద్యాసంస్థల ప్రిన్సిపాల్ ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

బుక్ కీపర్‌పై ఫిర్యాదు

ప్రజాశక్తి-ఉంగుటూరు (గన్నవరం): చిక్కవరం గ్రామంలోని సమత గ్రామైక్య సంఘం బుక్ కీపర్ పీకా నరసమ్మపై డ్వాక్రా మహిళా సంఘాల సభ్యులు మంగళవారం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. డ్వాక్రా గ్రూపుల నుంచి అధిక వడ్డీలు, అనవసరమైన చెల్లింపులు వసూలు చేస్తున్నారని, రుణాలు మంజూరు చేయడానికి బదులు నగదు వసూలు చేస్తున్నారని, తన కుటుంబ సభ్యుల రుణాలను ఇతరులపై భారం వేస్తున్నారని, ప్రశ్నించిన మహిళలపై అసభ్యంగా మాట్లాడటం, నకలీ కేసులు పెట్టి బెదిరించడం వంటి చేస్తున్నారని తెలిపారు. బుక్ కీపర్‌పై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

ప్రజాశక్తి-చల్లపల్లి: అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని ఐసిడిఎస్ పిడిఎం రాణి అన్నారు. జాతీయ పోషకాహార మహోత్సవంలో భాగంగా చల్లపల్లి మండల పరిషత్తు సమావేశపు మందిరంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. రాణి మాట్లాడుతూ గర్భిణీలు బాలింతలు చిన్నారులు రోజు ఉడికించిన గుడ్డు తినాలని ఉద్దేశంతో ప్రభుత్వం గుడ్లు ఇస్తున్నట్లు తెలిపారు. అందరి ఆరోగ్యం కోసం అంగన్వాడీ కేంద్రాలలో తెలియజేసే సూచనలు పాటించాలన్నారు. పిల్లలు ఆరోగ్యం గా ఉంటే జీవితంలో ఆరోగ్య వంతులుగా ఉంటారని, ఆరు నెలల పాటు తల్లిపాలు తర్వాత అనుబంధాహారం అందించాలని, ఊబకాయ వచ్చే ఆహారాన్ని పిల్లలకు దూరంగా ఉంచాలని స తెలిపారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ ప్రసన్న విశ్వనాథ, ఎంపీపీ కోట రాధిక, మార్కెట్ యార్డ్ చైర్మన్ కనకదుర్గ, స్వచ్ఛ ఆంధ్ర డైరెక్టర్ నాగమణి, తాసిల్దార్ ఎం.వనజాక్షి ఎండిఓ, ఎంఈఓ వెంకటేశ్వరరావు, సిహెచ్ఓ సుమతి, ప్రముఖ న్యాయవాది సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

సిజెఐపై దాడి అమానుషం

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్: సుప్రీం ప్రధాన న్యాయమూర్తి మీద దాడి అమానుషమని మచిలీపట్నం బార్ అసోసియేషన్ అధ్యక్షులు దివి పోతురాజు ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం జిల్లా కోర్టు ప్రాంగణంలోని బార్ అసోసియేషన్ హాలు న్యాయ దేవత ప్రతిమ ఎదుట అసోసియేషన్ సభ్యులు శాయన సుధాకర్, గాదె శామ్యూల్, కొండపల్లి వేణుగోపాల్, వేము కోటేశ్వరరావు, తిరుమాని సత్యనారాయణ, బొల్లా రాంబాబు, చలపాటి రాజేష్, సుధీర్, సాయి గణేష్, ఎ వి



గుడివాడలో...

వి రామాంజనేయులు, రెహనా, ఫణి కుమార్ తదితరులుతో కలిసి మాట్లాడుతూ న్యాయ వ్యవస్థపై దాడి చేస్తే మిగిలిన మొత్తం వ్యవస్థలపై దాడి చేసినట్లేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. **ఉంగుటూరు:** సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన దాడిని గన్నవరం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు అనుమోలు వెంకటేశ్వరరావు తీవ్రంగా ఖండించారు. ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. **మచిలీపట్నం రూరల్:** న్యాయమూర్తిపై జరిగిన దాడిని ఏపి ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగిశెట్టి ధర్మయ్యా, జిల్లా అధ్యక్షుడు కె సునిల్ కుమార్ ఖండించారు. ఇలాంటి దాడులకు పాల్పడిన వారిపై చట్ట పరంగా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. **అవనిగడ్డ:** సీతాయలంక వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద జై భీమ్ భారత్ పార్టీ ఆధ్వర్యంలో కళ్లకు గంతలు కట్టుకొని నిరసన ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో జై భీమ్ భారత్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ సముద్రాల

అవనిగడ్డలో...



అంబేద్కర్, మాల మహానాడు జిల్లా అధ్యక్షులు దోవ గోవర్ధన్, బీసీ నాయకులు కోలా బాలాజీ వర్మ తదితరులు పాల్గొన్నారు. **గుడివాడ :** భారత ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై దాడి రాజ్యాంగంపై చేసిన దాడి అని సిపిఎం గుడివాడ టౌన్ కమిటీ సభ్యులు లంకా సురేంద్ర అన్నారు. సిజిఐపై జరిగిన దాడిని ఖండిస్తూ గుడివాడ బంటుమిల్లి రోడ్డులోని శ్రీనివాస సెంటర్లో వామపక్షాల ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో వామపక్ష నాయకులు శ్రీనివాస్, ఎం లక్ష్మణరావు, త్రిమూర్తులు, అవిర్నేని వెంకటేశ్వరరావు, పివి రమణ, లక్ష్మణరావు, మహేశ్వరరావు, చౌటయ్య, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ట్రంప్ సుంకాలపై నోరు మెదపని కేంద్రం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రాంభూపాల్ విమర్శ

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాల టెర్రరిజంతో ప్రపంచ దేశాలపై ముఖ్యంగా భారత్‌పై దాడులు చేయడాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్ ఆక్షేపించారు. మంగళవారం స్థానిక జ్యోతిబాపూలే విజ్ఞాన కేంద్రంలో 'ట్రంప్ సుంకాల ఆంక్షలు-భారతదేశంపై ప్రభావం'పై సదస్సు నిర్వహించారు. సదస్సులో రాంభూపాల్ మాట్లాడుతూ అమెరికా నుండి డెయిరీ, విత్తనాలు, వ్యవసాయ ఉత్పత్తులు పన్నులు లేకుండా దిగుమతి చేసుకోవాలని ఒత్తిడి చేస్తుండడాన్ని కేంద్ర ప్రభుత్వం సమర్థవంతంగా తిప్పికొట్టాలన్నారు. ఇంకో వైపు వీసాల ఆంక్షలపై రోజుకొక ప్రకటనతో ఎన్నారై ఉద్యోగులు, విద్యార్థుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయన్నారు. అమెరికా ఆంక్షలకు తలవంచి అక్కడ విత్తనాలు దిగుమతి చేసుకుంటే దేశ వ్యవసాయ రంగం సంక్షోభంలో పడిపోతుందన్నారు. అమెరికాకు ఎగుమతి అయ్యే ఆక్వా ఉత్పత్తులపై 50 శాతం సుంకాలు పెంచడం పట్ల కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమై ప్రత్యామ్నాయ మార్కెట్ కల్పించాలన్నారు. ఈ పరిస్థితులలో దేశ ప్రయోజనాలు కాపాడాల్సిన కేంద్ర ప్రభుత్వం చేష్టలుడిగి చూస్తోందన్నారు. ఆత్మ నిర్భరత పేరుతో కాలక్షేపం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు, అంగన్వాడి వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి అంగత రమాదేవి, సిఐటియు జిల్లా కోశాధికారి పరుచూరి ధనశ్రీ పాల్గొన్నారు.

సుందర గ్రామంగా కూచిపూడి

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): నాట్య కళకు ప్రసిద్ధి చెందిన కూచిపూడి గ్రామాన్ని సుందరమైన వారసత్వ గ్రామంగా తీర్చిదిద్దేందుకు ముమ్మరంగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ నగరంలోని వారి చాంబర్లో మొవ్వ మండలం కూచిపూడి గ్రామం అభివృద్ధిపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ పథకం కింద మంజూరైన 3 కోట్ల రూపాయలు నిధులతో కూచిపూడి గ్రామాన్ని వారసత్వం గ్రామంగా సుందరంగా తీర్చిదిద్దాలని సూచించారు. ప్రతిపాదించిన మొదటి, రెండు ప్రాజెక్టు పనులను ఒకేసారి చేపట్టాలన్నారు. గ్రామంలో సరైన మురుగు నీటి వ్యవస్థను ఏర్పాటుచేసి మురుగునీరు బయటకు రాకుండా పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఈ సమావేశంలో సహాయ కలెక్టర్ ఫర్హీన్ జాహిద్, పర్యాటకశాఖ ఏడి లజ్వంత నాయుడు, జిల్లా పర్యాటక అధికారులు రామ లక్ష్మణ్, డిఆర్‌డిఏ పీడీ హరిహరనాథ్, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ సోమేశ్వర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

పులిగడ్డలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-అవనిగడ్డ: ఇటీవల తీవ్ర వరదలకు గురైన పులిగడ్డ పంచాయతీ శివారు పల్లెపాలెం రేగులంక గ్రామంలో రహదారులన్నీ బురదమయం కాగా గ్రామ సర్పంచ్ దాసరి విజయ్ కుమార్ ఈవో అనిత ఆధ్వర్యంలో శానిటేషన్ కార్యక్రమం నిర్వహించారు. అంటువ్యాధులు ప్రబలకుండా ప్రతి ఇంటి ముందు,



రహదారుల్లో బ్లీచింగ్ చల్లి శానిటేషన్ చేశారు. గ్రామంలో ఎవరైనా అనారోగ్యం బారిన పడితే తమ దష్టికి తీసుకురావాలని సర్పంచ్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మండలి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కొండలమ్మను దర్శించుకున్న రామకృష్ణయ్య

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: మండలంలోని వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారిని కృష్ణాజిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కేవీ రామకృష్ణయ్య మంగళవారం దర్శించుకున్నారు. వారికి దేవస్థాన ఈఓ ఆకుల కొండలరావు, ధర్మకర్తల మండలి చైర్మన్ ఈడే వెంకట విష్ణు మోహన్‌రావు ఆలయ మర్యాదలతో సాదరంగా స్వాగతం పలికి సన్మానించి అమ్మవారి చిత్ర పటంతో పాటు లడ్డూ ప్రసాదాలను



అందించారు. కొండలమ్మ అమ్మవారి దేవస్థానములో పౌర్ణమి సందర్భముగా మంగళవారం రుద్ర సహిత చండీ హోమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కేవీ రామకృష్ణయ్య, దేవస్థాన ఈఓ ఆకుల కొండలరావు, ధర్మకర్తల మండలి చైర్మన్ ఈడే వెంకట విష్ణు మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పద్ధతిలో కౌన్సిల్ నిర్వహించాలి

• సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్

ప్రజాశక్తి-విజయవాడ : అత్యంత ప్రాధాన్యత, విలువైన ఎంజి రోడ్డు (బందర్ రోడ్డు), కారల్‌మార్క్స్ రోడ్డు (ఏలూరు రోడ్డు)తోపాటు నగర పరిధిలోని 19 రహదారుల నిర్వహణ బాధ్యతను పిపిపి పద్ధతిలో కార్పొరేట్ కంపెనీలకు దారాదత్తం చేసే ప్రతిపాదనను ఆమోదించరాదని, ఈ అంశాన్ని సిపిఎం పూర్తిగా వ్యతిరేకిస్తుందని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ కోరారు. గవర్నర్‌పేటలోని శ్రీశ్రీభవన్‌లో ఆ పార్టీ ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబుతో కలిసి కాశీనాథ్ మంగళవారం కౌన్సిల్ అజెండా అంశాలపై విలేకరులతో మాట్లాడారు. బుధవారం జరిగే విజయవాడ నగరపాలక సంస్థ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని ప్రజాస్వామిక పద్ధతిలో నిర్వహించి, ప్రజావ్యతిరేక, ప్రజలకు భారమైన, విఎంసి ఆస్తులను ప్రయివేటు కంపెనీలకు దారాదత్తం చేసే ప్రతిపాదనలపై సిపిఎం కౌన్సిల్ లోపల, బయట పోరాడుతుందని అన్నారు. బిఆర్‌పి రోడ్డు, నెహ్రూ రోడ్డు, కెటి రోడ్డు, పివిపిమాల్ రోడ్డు ఇలా నగరంలోని 23.54 కిలోమీటర్ల పొడవు కల్గిన 19 రహదారులను పబ్లిక్ ప్రయివేటు పార్ట్నర్‌షిప్ (పిపిపి) పద్ధతిలో వాటి నిర్వహణను ప్రయివేటు కంపెనీలకు అప్పగించడానికి అజెండాలోని ఐదవ అంశంగా తీసుకొచ్చారని, ఈ



విధానాన్ని సిపిఎం పూర్తిగా వ్యతిరేకిస్తుందని అన్నారు. రహదారులను ప్రయివేటు కంపెనీలకిచ్చే అంశంపై వైసిపి కూడా సిపిఎంతో కలిసి రావాలని కోరారు. కపెక్స్ కాస్ట్ రూ. 32 కోట్లు, అలాగే పది సంవత్సరాల కాలంలో ఏడాదికి రూ.12 కోట్లు ఒఅండ్ ఎం కింద విఎంసి జనరల్ నిధుల నుంచి చెల్లించే విధంగా రహదారుల ప్రయివేటీకరణ అత్యంత బాధాకరమని అన్నారు. ఈ అంశాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఇంజినీరింగ్ కార్మికులకు పరికరాలతో పాటు షిఫ్ట్‌ల (ఎనిమిది గంటలు) వారీగా పని చేసే విధంగా నిర్ణయం చేయాలన్నారు. బుడమేరు ముంపు నివారణ శాశ్వత చర్యలకు కూటమి ప్రభుత్వం నేటికీ ఒక్క పైసా కూడా నిధులు కేటాయించలేదని విమర్శించారు. నిధులు కేటాయించి ముంపు నివారణకు చర్యలు తీసుకోవాలని సిపిఎం... సిఎంకు, మంత్రులకు బహిరంగ లేఖ రాసినా పట్టించుకోలేదన్నారు. గత 17 రోజుల సమ్మెకాలపు వేతనాలు పారిశుధ్య కార్మికులకు మంజూరు చేయాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ యాక్ట్ ద్వారా ఫుడ్ కోర్టు నిర్వహించాలనే పద్ధతిలో తీసుకొచ్చిన ప్రతిపాదనను ఆమోదించరాదని కోరారు. సిపిఎంఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు మాట్లాడుతూ...నగరాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి టిడిపి కూటమికి చెందిన ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్లు, కౌన్సిల్‌లోని అధికార వైసిపి ఘోరంగా విఫలమయ్యారని, ఫలితంగా రూ. 250 కోట్ల వరకు వివిధ రకాల బిల్లులు చెల్లించాల్సి ఉందని, దీంతో పనులు చేయడానికి విఎంసి కాంట్రాక్టర్లు ముందకు రాని వైనం నెలకొన్నదని అన్నారు. రూ. 642 కోట్ల వివిధ రకాల గ్రాంట్స్ రాష్ట్ర ప్రభుత్వం నుంచి విఎంసికి రావాల్సి ఉందని, వీటిపై ఇరు పార్టీలు పట్టించుకోవడం లేదని విమర్శించారు. చిన్న పాటి వర్షానికే నగరం చెరువుల్లా తయారవుతుందని... నేటికీ రూ. 289 కోట్లు స్ట్రామ్ వాటర్ డ్రెయినేజి స్కీమ్ నిధులు ప్రభుత్వం నుంచి మంజూరు కావాల్సి ఉందన్నారు. నిధులు వెంటనే విడుదల చేసి, డ్రెయినేజి వ్యవస్థను మెరుగుపరచాలని కోరారు. టిడ్కో గృహాలకు సదరు లబ్దిదారులు అప్పులు చేసి డబ్బులు చెల్లించినా కూటమి ప్రభుత్వం కేటాయించడం లేదని పేర్కొన్నారు. రూ. 120 కోట్లు మంజూరు చేస్తే వేలాది గృహాలు పూర్తి అవుతాయని, వెంటనే లబ్దిదారులకు పంపిణీ చేయాలని కోరారు. గుణదల ప్రాంతంలోని 33 ఇళ్ల ప్లాట్స్‌ను సీనియారిటీ ప్రకారం కేటాయించాలని కోరారు.

సిఐటియు విజయవాడ పశ్చిమ సిటీ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : సీఐటీయూ విజయవాడ పశ్చిమ సిటీ 17వ మహాసభ మంగళవారం చిట్టి నగర్‌లోని విశ్వ బ్రాహ్మణ కల్యాణ మండపంలో జరిగింది. సీఐటీయూ పశ్చిమ నగర నూతన కమిటీ 13 మంది ఆఫీస్ బేరర్స్‌తోపాటు 34 మంది సభ్యులతో ఏర్పాటైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఎ వెంకటేశ్వరావు, సిపిఎం కార్పొరేటర్ బోయి సత్య బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సభను ఉద్దేశించి వక్తలు మాట్లాడుతూ కార్మిక చట్టాల ఉల్లంఘనలకు పాల్పడుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన గుణపాఠం నేర్పాలని పిలుపునిచ్చారు. ఏళ్ల తరబడి పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను కాలరాస్తూ తీసుకొచ్చిన లేబర్ కోడ్లను రద్దు చేసే వరకు రాజీలేని పోరాటానికి సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. అసెంబ్లీలో కార్మికుల పని గంటలను పెంపు చేస్తూ తీసుకొచ్చిన నూతన చట్టాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలియజేశారు. అనంతరం సిఐటియు పశ్చిమ 17వ మహాసభ నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. నూతన కార్యవర్గ అధ్యక్షునిగా జి వెంకట్రావు, కార్యదర్శిగా ఇవి నారాయణ, కోశాధికారిగా సిహెచ్ దాసు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గం సీఐటీయూ నాయకులు కార్యకర్తలుతో పాటు సీఐటీయూ షాప్ ఎంప్లాయిస్ యూనియన్ సెక్రటరీ బాబు ఖాన్పాల్గొన్నారు.



స్కాలర్‌షిప్‌లు పంపిణీ

ప్రజాశక్తి - విజయవాడసిటీ : పశ్చిమ నియోజకవర్గంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. విజయవాడ వాల్మీకి (బోయ) సేవా సంఘం ఆధ్వర్యంలో భీమనవారి పేటలోని వాల్మీకి భవన్‌లో నిర్వహించిన ఈ వేడుకలలో పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ పాల్గొన్నారు. తొలుత వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా విజయవాడ వాల్మీకి, (బోయ) సేవా సంఘం ఆధ్వర్యంలో పదో తరగతిలో అత్యధిక మార్కుల సాధించిన 84 మంది విద్యార్థిని విద్యార్థులకు శ్రీధర్ చేతుల మీదుగా ఉపకార వేతనాలను అందించారు. వాల్మీకి బోయ సేవా సంఘం అధ్యక్షుడు నరసింహారావు మాట్లాడుతూ ప్రభుత్వం వాల్మీకి మహర్షి జయంతిని అధికారికంగా నిర్వహించడం అభినందనీయమని తెలిపారు.



నేత్ర పర్వంగా గిరి ప్రదక్షిణ

ప్రజాశక్తి - విజయవాడ సిటీ: ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన కనకదుర్గ అమ్మవారి పౌర్ణమి గిరి ప్రదక్షిణ మంగళవారం వేకువజామున వైభవంగా జరిగింది. అమ్మవారి గిరి ప్రదక్షిణ ప్రారంభానికి ముందు ఆలయ ఈవో వి.కె.శీనానాయక్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. దుర్గగుడి పాలకమండలి నూతన చైర్మన్ బొర్ర రాధాకష్ణ, దేవాదాయ శాఖ ఎస్టేట్ ఆఫీసర్ ఆర్ జె సి భ్రమరాంబ గిరి ప్రదక్షిణలో పాల్గొన్నారు. ఆలయ స్థానాచార్యులు శివ ప్రసాద్ శర్మ , శ్రీనివాస శాస్త్రి, గిరి ప్రదక్షిణ మహెూత్సవంలో పాల్గొన్నారు.

నిస్సాన్ సి ఎస్‌యువి టెక్టన్ విడుదల

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : నిస్సాన్ మోటార్ గ్లోబల్ ఎస్‌యూవీ లైనప్‌కు సరికొత్త ఎడిషన్ కోసం డిజైన్ యొక్క ప్రివ్యూ సరికొత్త నిస్సాన్ టెక్టన్‌ను ఆవిష్కరించినట్లు నిస్సాన్ మోటార్ మేనేజింగ్ డైరెక్టర్ సౌరాబ్ వాట్సా ఒక ప్రకటనలో తెలిపారు. నిస్సాన్ ఆశయాన్ని ప్రతిబింబించే పేరుగా టెక్టన్ ఉంటుందన్నారు. ఇది ఇంజనీరింగ్ ఎక్సలెన్స్, పనితీరు, విలక్షణమైన డిజైన్ గుర్తింపును కలిగి ఉంటుందన్నారు. టెక్టన్ వారి కెరీర్లు, అభిరుచులు, జీవనశైలి ద్వారా "వారి ప్రపంచాన్ని రూపొందిస్తున్న" వారికి ఎంపిక అవుతుందని తెలిపారు. కమాండింగ్ వైఖరి, బోల్డ్ లుక్స్ మరియు ప్రీమియం ఇంటీరియర్‌లతో, ఇది ఒక సెగ్మెంట్ డిస్ట్రప్టర్‌గా ఉంటుందని మేము విశ్వసిస్తున్నాము అని అన్నారు.

చెకుముకి సైన్స్ సంబరాల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : చెకుముకి సైన్స్ సంబరాలను జయప్రదం చేయాలని ఎన్‌టిఆర్ జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వి.సుబ్బారావు పిలుపు నిచ్చారు. జన విజ్ఞాన వేదిక (జెవివి) ఆధ్వర్యాన నిర్వహించే చెకుముకి సైన్స్ సంబరాల పోస్టర్‌ను ఆయన మంగళవారం ఆవిష్క రించారు. నగరంలోని డిఇఒ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో జెవివి నాయకులు వెలగా శ్రీనివాస్, బోయి రవి పాల్గొన్నారు. ఈసందర్భంగా జెవివి నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో 35 సంవత్సరాలుగా చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి ఏడాది 5 లక్షలకు పైగా విద్యార్థులు పాల్గొంటున్నారని వివరించారు. విద్యార్థులలో సైన్స్ పట్ల జిజ్ఞాసను పెంచడం కోసం పాఠశాల స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు 4 దశలలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. విజయవాడ నగరంలో 80 పాఠశాలలో చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. పాఠశాల స్థాయి పూర్తయిన తరువాత నవంబర్ 1 నుండి నగర స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలను వన్‌టౌన్లోని గాంధీజీ మున్సిపల్ హైస్కూల్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు.



కార్మికులకు బియ్యం పంపిణీ

ప్రజాశక్తి- నందిగామ : దీపావళి పండుగ సందర్భంగా నందిగామలో వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న భవన నిర్మాణ శ్రామికులు 20 కుటుంబాలకు ఒక్కొక్కరికి 10 కేజీలు చొప్పున మంగళవారం ఉచితంగా బియ్యం పంపిణీ చేశారు. నందిగామ నవాబుపేట గ్రామ వాస్తవ్యులు పోలిశెట్టి సుధాకర్ జ్ఞాపకార్ధం ఆయన భార్య పద్మావతి, కుమారులు పోలిశెట్టి వెంకటరావు, పోలిశెట్టి ఉపేంద్ర, పోలిశెట్టి సురేష్ సహకారంతో బియ్యం పంపిణీ చేశారు. ఆర్యవైశ్య సంఘం నందిగామ ప్రముఖుడు పారేపల్లి సాయిబాబు, డోగుపర్తి సుధీర్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులు ఆటల్లోనూ రాణించాలి

ప్రజాశక్తి-వత్సవాయి : విద్యార్థులకు చదువుతోపాటు ఆటలు కూడా ముఖ్యమని కె.వి.ఆర్ బాలుర హైస్కూల్ హెచ్‌ఎమ్ కె జలజ, బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నక్కా బాబురావు అన్నారు. మంగళవారం నియోజకవర్గ స్థాయిలో వివిధ ఆటలకు విద్యార్థులను ఎంపిక చేసే కార్యక్రమం స్థానిక కె.వి.ఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో మండల క్రీడా అధికారి వేగినటి వెంకటరమణ ఆధ్వర్యంలో జరిగాయి. ఈ కార్యక్రమంలో వివిధ ఆటల పోటీలను పాఠశాల కమిటీ చైర్మన్ సముద్రాల రామారావు, ప్రధానోపాధ్యాయులు జలజ, బాబూరావులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు బాబు ప్రసాద్, సౌడా నాయక్, రేగండ్ల ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనాల కోసం ఆశాల ఆందోళనలు

మైలవరం : ఆశాలకు కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ పలుచోట్ల ఆశాలు నిరనలు తెలిపారు. ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం మైలవరం మండలంలోని చంద్రాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు పి.జ్యోతి మాట్లాడుతూ ఆశా వర్కర్లకు కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్‌ను ఆశ వర్కర్లుగా మార్పు చేయాలని, ఆశలతో సమానంగా వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని చంద్రాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి అధ్యక్షురాలు సంతోషం, కె.రమణ, సంధ్య, వెంకమ్మ, నాగమణి పాల్గొన్నారు. **ఏ.కొండూరు :** ఏ కొండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ధర్నాలో ఆశా వర్కర్ల యూనియన్ ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ కమల మాట్లాడుతూ పెరిగిన ధరలకు తగ్గట్టుగా వేతనాలు పెరగకపోవడం వల్ల ఆశా వర్కర్లు ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం మ్యానిఫెస్టోలో ప్రకటించిన మేరకు ఆశాలకు జీతాలు పెంచాలని డిమాండ్ చేశారను. ఈ సందర్భంగా 13 మందితో కూడిన నూతన ఆశా వర్కర్ల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా డి లక్ష్మీ, పి శ్రావణి, కోశాధికారిగా పి శైలజ, ఉపాధ్యక్షురాలుగా డి యశోద, సహాయ కార్యదర్శిగా ఎన్ రోజామణిలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి జెట్టి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


నందిగామలో ఆశా కార్యకర్త ఆందోళన


ఏ.కొండూరులో నిరసన తెలుపుతున్న ఆశాలు

నందిగామ : నందిగామ మండలం లింగాలపాడు, గోళ్ళమూడి పిహెచ్‌సిల ఆశా వర్కర్ యూనియర్ ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి కె.గోపాల్ మాట్లాడుతూ ఆశా వర్కర్స్ కు కనీస వేతనాలు చెల్లించాలని, జాతీయ సెలవులు, పండుగ సెలవులు, వారాంతపు సెలవు, క్యాజువల్ లీవ్స్, మెడికల్ లీవ్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు వి.ఏసోబు, లింగాలపాడు పీహెచ్సీ ఆశ వర్కర్ యూనియన్ అధ్యక్షులు ఎం. తిరుమలదేవి, వనజ, కవిత, గోళ్ళమూడి పీహెచ్సీ నాయకులు కె. మారత్త మ్మ,ఆదిలక్ష్మి, సునీత, తదితరులు పాల్గొన్నారు.



స్వచ్ఛత, పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత

కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని

ప్రజాశక్తి-ఉంగుటూరు: కృష్ణా మిల్క్ యూనియన్‌కు స్వచ్ఛాంధ్ర అవార్డు రావడం పట్ల మంగళవారం వీరవల్లి ఫ్యాక్టరీ ఆవరణలోని ప్రాజెక్ట్ కామధేనులో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు మాట్లాడుతూ 'బెస్ట్ స్వచ్ఛ ఇండస్ట్రీ' విభాగంలో కృష్ణా మిల్క్ యూనియన్ మొదటి ర్యాంక్ సాధించి సిఎం చేతుల మీదుగా అవార్డు అందుకున్నట్లు చెప్పారు. ఈ గౌరవం లక్షాయాభై ఐదు వేల పాడి రైతు కుటుంబాలకు దక్కినట్లుగా భావిస్తున్నామన్నారు. ప్రాజెక్ట్ కామధేను ప్లాంట్ విశాలమైన ప్రాంగణంలో స్వచ్ఛత, పరిశుభ్రత, పచ్చదనానికి అత్యధిక ప్రాధాన్యతనిచ్చి, రాష్ట్ర ప్రజలకు పుష్టికరమైన పాలు, పాల పదార్థాలు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఈ విజయానికి కృషి చేసిన సంస్థ పాలకవర్గం, అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. మేనేజింగ్ డైరెక్టర్ కొల్లి ఈశ్వరబాబు మాట్లాడుతూ కృష్ణా మిల్క్ యూనియన్‌కు మొదటి స్థానం లభించడం గర్వకారణమని తెలిపారు. ఈ అవార్డు సాధనకు కృషి చేసిన యూనియన్ కుటుంబ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు డా. దాసరి వెంకట బాలవర్ధనరావు తదితరులు పాల్గొన్నారు.

స్కిల్ హబ్‌లో ఉచిత శిక్షణ

ప్రజాశక్తి-గుడివాడ

గుడివాడలో గల కేబిఆర్ గవర్నమెంట్ ఐటిఐ కాలేజ్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ ద్వారా నిర్వహించబడుతున్న స్కిల్ హబ్‌లో ఫ్రంట్ ఆఫీస్ అసిస్టెంట్ కోర్సును రెండు నెలల పాటు ఉచిత శిక్షణా తరగతులు అందిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాధికారి డా పి.నరేష్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సులో చేరడానికి విద్యార్హత పదవ తరగతి, ఆపైన చదివి ఉండాలని, ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువతీ యువకులు ఉపయోగించుకోవాలని ఐటిఐ ప్రిన్సిపాల్, కన్వీనర్ ఓ. మంజులాదేవి తెలిపారు. ప్రస్తుతం రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయని వివరాలకు 9848819682,9 666654641 నెంబర్లను సంప్రదించాలన్నారు.

సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-గుడివాడ

పేదల పక్షపాతి సిఎం చంద్రబాబు అని, పేద వర్గాల ఉన్నతికి ఎన్టీఆర్ స్ఫూర్తిని కొనసాగిస్తున్నారని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. మంగళవారం స్థానిక ఏలూరు రోడ్డులోని టిడిపి కార్యాలయం(ప్రజా వేదిక)లో నియోజకవర్గ పరిధిలోని 12 మంది బాధిత కుటుంబాలకు రూ.6.23 లక్షల సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాధాకష్ణ, టిడిపి నాయకులు పండ్రాజు సాంబయ్య, కడియాల గణేష్, సీతయ్య, మల్లి, మల్లికార్జునరావు, తదితరులు పాల్గొన్నారు.



పని గంటల పెంపుపై ప్రజాసంఘాల నిరసన

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్: కూటమి ప్రభుత్వం పెట్టుబడిదారులకు అనుకూలంగా విడుదల చేసిన పని గంటల పెంపు జీవోను సత్వరమే ఉపసంహరించుకోవాలని ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. పని గంటల పెంపును నిరసిస్తూ మంగళవారం కోనేరు సెంటర్లో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మికుల శ్రమను పెట్టుబడిదారీ వర్గాలకు దోచిపెట్టే నల్ల జీవోలను వెనక్కి తీసుకునే వరకు పోరాడుతామని స్పష్టం చేశారు. అన్ని రంగాలలో పనిచేస్తున్న కార్మికుల రక్త మాంసాలను పని గంటల పెంపు రూపంలో కబళిస్తున్న కూటమి ప్రభుత్వం వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్మిక వర్గాల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు కళ్లం



వెంకటేశ్వరరావు, వై.నరసింహారావు, పంచకర్ల రంగారావు, ఆర్‌సిపి రెడ్డి, మద్రపు పోలినాయుడు, కోసూరు శ్రీనివాసరావు, పోలన రజిని, బండ్రపల్లి కీర్తి, కోసూరు శివ నాగేంద్రం, గౌరిశెట్టి నాగేశ్వరరావు, బెజవాడ తాతబ్బాయి, కంభం కొండలబాబు, బూర సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



జిఎస్‌టిపై విద్యార్థులకు పోటీలు

ప్రజాశక్తి-మొవ్వ: జిఎస్టి ఛాంపియన్ షెడ్యూల్ లో భాగంగా మంగళవారం కూచిపూడి శ్రీ సిద్ధేంద్ర జిల్లా పరిషత్ ఓరియంటల్ హైస్కూల్లో కూచిపూడి సచివాలయ వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ విద్యార్థిని విద్యార్థులకు పలు అంశాలలో పోటీలు నిర్వహించారు. జీఎస్టీ సంస్కరణల మూలంగా సంభవించే శుభపరిణామాలపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయురాలు జే కవిత పర్యవేక్షణలో కొనసాగిన ఈ పోటీలకు కూచిపూడి సచివాలయ వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ పి ఉమామహేశ్వరరావు, డిజిటల్ అసిస్టెంట్ ఏ అరుణ, పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ ఏ రామ్ ఫణీంద్ర పాల్గొనగా పాఠశాల ఉపాధ్యాయులు సహకరించారు. అంతకు ముందుగా జీఎస్టీ తగ్గింపుపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు.

కుష్టు బాధితులకు చెప్పులు పంపిణీ

ప్రజాశక్తి-ఉంగుటూరు: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ గన్నవరం శాఖ ఆధ్వర్యంలో కేసరపల్లి లెప్రసీ కాలనీలో నివసిస్తున్న 11 మంది కుష్టు రోగులకు ప్రత్యేకంగా తయారు చేయబడిన చెప్పులు బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సెల్ఫ్ కేర్ కిట్ లెప్రా సొసైటీ ప్రతినిధి మామిడి రాధిక, కుష్టు నివారణ అధికారి నాగరాజు



పాల్గొన్నారు. అలాగే కేన్సర్‌తో బాధపడుతున్న వీసం నాగరాజుకు రూ.5 వేలు, పక్షవాతంతో బాధపడుతున్న అమెరికా అనే వ్యక్తికి రూ.3 వేలు అందజేశారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన ప్రజాశక్తి విలేకరి నెక్కలపు శ్రీనివాసరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మానవత సంస్థ చైర్మన్ మడుపల్లి బాలకృష్ణమూర్తి, కన్వీనర్ కర్రా వర ప్రసాద్, అధ్యక్షుడు వీసం ప్రసాదరావు, కార్యదర్శి వివి కృష్ణమోహన్, గౌరవ సలహాదారు ముక్కామల సుబ్బారావు, ఉపాధ్యక్షుడు పువ్వల ఆదినారాయణ, సంయుక్త కార్యదర్శి వడ్లమూడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వరి సాగుపై అవగాహన

ప్రజాశక్తి-ఉంగుటూరు: వరి పంటలో చిరు పొట్ట దశ ప్రారంభమైనందున సమగ్రమైన రక్షణ చర్యలను చేపట్టాలని జిల్లా వనరుల కేంద్రం అధికారులు సూచించారు. మండలంలోని తేలప్రోలు వ్యవసాయ రైతు సేవా కేంద్రంలో మంగళవారం రైతులకు వరి పంటపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిడిఎ జ్యోతి రమణి మాట్లాడుతూ



చీడపీడలు, తెగుళ్లపై రైతులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని పిలుపునిచ్చారు. కాండం తొలుసు పురుగు, మెడ విరుపు తెగులు, పొట్ట కుళ్లు తెగులు వంటి రోగాలు పంటను దరిచేరకుండా నివారణ చర్యలు త్వరితగతిన చేపట్టాలని సూచించారు. వ్యవసాయ శాఖ జిల్లా సహాయ అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ వరి పంటలో ఎరువులు వెయడం చాలా ముఖ్యమని, కానీ అనవసరంగా అదనపు ఎరువులు, పురుగుమందులు వాడకూడదని హెచ్చరించారు. భూసార పరీక్ష ఫలితాలను అనుసరించి మాత్రమే ఎరువులు వేసుకోవాలని రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రమేష్ పాల్గొన్నారు.

పేర్ని ఆత్మ విమర్శ చేసుకోవాలి : బండి

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్: పదేపదే ప్రెస్‌మీట్‌లు పెట్టి స్థానిక ఎంపీని, జనసేన పార్టీ అధ్యక్షులు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుని విమర్శించినప్పటికీ ప్రజలు గత ప్రభుత్వంలో సాగించిన అవినీతి అక్రమాలు, అరాచకాలను మర్చిపోరని మచిలీపట్నం జనసేన పార్టీ ఇంచార్జ్ ఉమ్మడి కృష్ణాజిల్లా డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ పేర్కొన్నారు.



మంగళవారం స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. ఎదుటి వారిని విమర్శించే ముందు ఆత్మ విమర్శ చేసుకుంటే వైసీపీకి ప్రజలు ఈ పరిస్థితి ఎందుకు కల్పించారనేది అర్థమవుతుందన్నారు. కూటమి ప్రభుత్వం కక్ష రాజకీయాల జోలికి పోకుండా సంక్షేమం, అభివృద్ధి రాజకీయాలు నడుపుతుందన్నారు. కేవలం పేర్ని నాని, కొడాలి నాని, వల్లభనేని వంశీ, రోజా, అంబటి రాంబాబుల నోటీ దురుసు వల్లే రాష్ట్ర ప్రజలు వైసిపిని ఖాళీగా కూర్చో పెట్టారని ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో జనసేన నేతలు మాదివాడ రాము, గడ్డం రాజు, గల్లా తిమోతి పాల్గొన్నారు.

వాల్మీకి జయంతి వేడుకలు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు మంగళవారం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ సమావేశ హాలులో ఘనంగా జరిగాయి. జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ వాల్మీకి చిత్ర పటానికి పూలమాలను వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులు అర్పించారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆ శాఖ జిల్లా అధికారి జి రమేష్, మెప్మా పీడీ సాయిబాబు తదితరులు భాగస్వాములై వాల్మీకి చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. వాల్మీకి మహర్షి బోధనలు నేటి సమాజంలో సమానత్వం, నీతి, క్రమశిక్షణ, సేవామార్గం వంటి విలువలను పెంపొందించేందుకు దోహదపడతాయని జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు పేర్కొన్నారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి మహర్షి చిత్రపటానికి ఎస్పి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ యుగాలు మారినా కూడా నేటి తరానికి ఆదర్శంగా నిలిచే విధంగా సమాజానికి అందించిన రామాయణ మధుర కావ్యం ఎంతో ఆదర్శవంతమైనదన్నారు.



నాగవరంలో సమస్యలు పరిష్కరించండి

అధికారులకు కలెక్టర్ బాలాజీ ఆదేశం


ప్రజాశక్తి-గూడూరు, గుడ్లవల్లేరు: నాగవరం గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం జిల్లా కలెక్టర్ గుడ్లవల్లేరు మండలం వేమవరం పంచాయతీ, గూడూరు మండలం ముకొల్లు పంచాయతీ సరిహద్దులో ఉన్న నాగవరం గ్రామాన్ని సందర్శించారు. అక్కడి గ్రామ ప్రజలతో కలెక్టర్ ముఖాముఖి మాట్లాడారు. గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాగవరం గ్రామస్తులు మాట్లాడుతూ రెండు నియోజకవర్గాలు రెండు మండలాలు రెండు గ్రామపంచాయతీలలో నాగవరం గ్రామం సరిహద్దు గ్రామంగా ఉండడంతో తాము ఎలాంటి అభివృద్ధికి నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నాగవరం గ్రామం ఒకవైపు గుడ్లవల్లేరు మండలం వేమవరం పంచాయతీ పరిధిలో 250 మంది జనాభా ఉన్నారని, మరోవైపు గూడూరు మండలం ముకొల్లు పంచాయితీ పరిధిలో 169 మంది జనాభా ఉన్నారన్నారు. ముకొల్లు పంచాయతీలో మొత్తం1429 మంది జనాభా ఉన్నారన్నారు. ముఖ్యంగా అక్కడ ఉన్న మంచినీటి పథకం ద్వారా రెండు రోజులకు ఒకసారి నీరు సరఫరా చేస్తున్న అందరికీ సరిపోవటం లేదని కలెక్టర్ దష్టికి తీసుకుని వచ్చారు. గ్రామ మొదటి లో ఉన్న శివాలయం నుండి గ్రామం లోపలికి రావడానికి చీకటిగా ఉండటంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు మనవి చేశారు. అంతేకాకుండా సరైన రహదారి లేకపోవడంతో వాహనాల రాకపోకలకు చాలా ఇబ్బంది కలుగుతుందన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ వెంటనే స్పందిస్తూ సంబంధిత అధికారులతో చర్చించారు. అనంతరం జిల్లా కలెక్టర్ గ్రామస్తులతో మాట్లాడుతూ నాగవరం గ్రామంలోని ప్రజలు గ్రామసభ నిర్వహించుకుని వారి కోరిక మేరకు అందరూ గుడ్లవల్లేరు మండలం వేమవరం పంచాయతీలో ఉంటామనేటట్లుగా


గ్రామస్తులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

సానుకూలంగా తీర్మానాలు చేసి పంపిస్తే, వాటిని మండల పరిషత్, జిల్లా పరిషత్తు సర్వసభ్య సమావేశాల్లో ఆమోదించుకుని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామన్నారు. ప్రభుత్వం నుండి ప్రతిపాదనలు ఆమోదించేటట్లుగా అన్ని విధాలా కషి చేస్తామన్నారు. గ్రామంలో మంచినీటి కోసం ప్రస్తుతం ఉన్న చిన్న పైపులైనుకు అదనంగా మరో పైపులైను ఏర్పాటు చేసి గ్రామస్తులకు సరిపడే విధంగా నీటిని సరఫరా చేయిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ శివప్రసాద్, పంచాయతీరాజ్ ఎస్ఈ రమణరావు, ఆర్డబ్ల్యూఎస్ సోమేశ్వరరావు, ఈఈ నటరాజు, గుడ్లవల్లేరు గూడూరు ఎంపీడీవోలు ఇమ్రాన్, శైలజ, నాగవరం సర్పంచ్ పద్మావతి, పంచాయతీరాజ్ ఏఈ నాగేశ్వరరావు, నాగవరం, ముకొల్లు పంచాయతీ కార్యదర్శులు దుర్గా నాగమల్లేశ్వరరావు, బాపూజీ పాల్గొన్నారు.

న్యాయవాదులు విధుల బహిష్కరణ

విజయవాడ : దేశ అత్యున్నత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయిపై అనాగరిక దాడి చర్యను ఖండిస్తూ కృష్ణా జిల్లా బార్ ఫెడరేషన్ పిలుపు మేరకు మంగళవారం విజయవాడలో న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. అనంతరం న్యాయవాదులందరూ ర్యాలీగా నిరసన ప్రదర్శన చేస్తూ కోర్టు నుండి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి, అక్కడ ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో బెజవాడ బార్ అధ్యక్షులు ఎకె భాషా మాట్లాడుతూ దేశ అత్యున్నత న్యాయస్థానంలోనే ప్రధాన న్యాయమూర్తిపై దాడి జరిగితే సామాన్య న్యాయమూర్తిలకు, న్యాయవాదులకు ఇక రక్షణ ఎక్కడ ఉంటుందని ప్రశ్నించారు. దాడికి పాల్పడిన నిందితుడిపై సత్వరమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏపీ బార్ కౌన్సిల్ మెంబర్స్ సుంకర రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ... దేశంలో ప్రజల మధ్య మతోన్మాద వైషమ్యాలు పెంచుతున్న శక్తులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా న్యాయవాది నరహరశెట్టి జ్యోతి, ఏపీ బార్ కౌన్సిల్ మెంబర్స్ చలసాని అజయ్ కుమార్, మాజీ బార్ అధ్యక్షులు మట్ట జయకర్, సంపర దుర్గా శ్రీనివాస్, మాజీ బార్ కార్యదర్శి రాజా, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ జి లక్ష్మీశాకు వినతి పత్రం అందజేశారు. **జగ్గయ్యపేట:** పట్టణంలోని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలో ఐలు ఆధ్వర్యంలో న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐలు నాయకులు కాసరగడ్డ నాగేశ్వరరావు, కె శ్రీనివాసరావు, జె వెంకటరావు, కరిసే రత్నబాబు, దాసరి నాగేశ్వరరావు, న్యాయవాదులు జే శ్రీనివాసరావు, పి నాగరాజు, బసవరాజు, టిఎల్ నరసింహారావు, మెట్టెల ఆంజనేయులు పాల్గొన్నారు. జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు అన్నెపాగ సుందరావు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. **తిరువూరు :** తిరువూరు కోర్టు ముందు ఐలూ ఆధ్వర్యంలో న్యాయవాదులు ఆందోళన చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది నాగేంద్రప్రసాద్, తిరువూరు బార్ అసోసియేషన్ కార్యదర్శి మేకల రవి, మాజీ అధ్యక్షులు మర్సకట్ల కుమార్, సిహెచ్ రాజేంద్ర బాబు, మాలావత్ రాము, పాల్గొన్నారు. **నందిగామ :**నందిగామ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు నందిగామ గాంధీ సెంటర్‌లో నిరసన తెలిపారు. నందిగామ ఆర్డిఒ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి ఆర్డిఒ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ధర్నాలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు నంద్రు బాబు విద్యాసాగర్, న్యాయవాదులు దాసరి వెంకటేశ్వర రావు, మన్నెం నారాయణ రావు, బార్ ప్రధాన కార్యదర్శి అద్దంకి మణిబాబు, ఉపాధ్యక్షులు విజయకుమార్, పాల్గొన్నారు.



తిరువూరులో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు



నందిగామలో ఆందోళన చేస్తున్న న్యాయవాదులు

పింఛన్ విధుల నుండి తొలగించాలని వినతి



ప్రజాశక్తి-మైలవరం : పెన్షన్ పంపిణీ నుండి మినహాయించాలని కోరుతూ సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ సుధాకర్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు మంగళవారం స్థానిక ఎంపిడిఒ అనురాధకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ పెన్షన్ పంపిణీలో అంగన్వాడీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, అంగన్‌వాడీ సెంటర్లలో బాలింతలకు, పిల్లలకు ఇవ్వవలసిన పోషక ఆహారాన్ని సకాలంలో ఇవ్వలేకపోతున్నారని తెలిపారు. తక్షణమే అంగన్వాడీ కార్యకర్తలను పెన్షన్ పంపిణీ నుండి మినహాయించాలని, లేనిపక్షంలో పనులు బహిష్కరించి ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

వాట్సప్ గవర్నెన్స్‌తో సమస్యలు సత్వర పరిష్కారం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రజలకు సులభంగా సేవలు అందుతాయని ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ (తాతయ్య) తెలిపారు. పట్టణంలోని మున్సిపాలిటీ పరిధిలో మున్సిపల్ గ్రీవెన్స్ నెంబర్ 9511141115ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర మాట్లాడుతూ జగ్గయ్యపేట మున్సిపాలిటీ ప్రజల సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు ఆధునిక సాంకేతికతను వినియోగించుకుంటోందని, ఈ కొత్త వాట్సాప్ గవర్నెన్స్ వ్యవస్థ ద్వారా పౌరులు తమ సమస్యలను నేరుగా మున్సిపల్ కార్యాలయానికి తెలియజేయవచ్చుని, ఫిర్యాదు అందిన 48 గంటల్లో సమస్య పరిష్కరించబడుతుందని తెలిపారు. ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ (తాతయ్య) మాట్లాడుతూ ప్రతి పౌరుడి ఫిర్యాదు విలువైనదేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ తులసి వెంకటకష్ణారావు, డిఇ శివ కోటేశ్వరరావు, ఎఇ హనుమంతరావు, పాల్గొన్నారు.



సిజెఐపై దాడిని నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళనలు

విజయవాడ : సిజెఐపై దాడిని నిరిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో మంగళవారం పలుచోట్ల ఆందోళనలు చేశారు. సింగ్ నగర్ 58వ డివిజన్‌లో చేపట్టిన ఆందోళనలో సిపిఎం సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి భూపతి రమణారావు మాట్లాడుతూ సిజెఐ గవాయిపై దాడి చేసిన నిందితులపై కేంద్రం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సిపిఎం నగర కమిటీ సభ్యులు ఎస్.కె నిజాముద్దీన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఎం సిటీ సెక్రటేరియట్ సభ్యులు కె దుర్గారావు, నగర కమిటీ సభ్యులు సిహెచ్ శ్రీనివాస్, సోమేశ్వరరావు, స్థానిక నాయకులు ఎస్‌కె రసూల్, వెంకటేశ్వరరావు, పి పవన్ కుమార్, మల్లేశ్వరరావు, పాల్గొన్నారు. **తిరువూరు :** తిరువూరు బోసు బొమ్మ బస్‌స్టాప్ సెంటర్‌లో సిపిఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.నాగేంద్ర ప్రసాద్, సిపిఎం సీనియర్ నాయకులు గుల్లపల్లి వెంకటర త్నం, ఎస్వీ భద్రం, బి వెంకటేశ్వరావు, ఆకుల రవి, పి.శ్రీనివాసరావు, మోటూరి చింతయ్య, చప్పిడి సురేష్, పాల్గొన్నారు. **విస్సన్నపేట:** విస్సన్నపేటలో సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ గాంధీబొమ్మ సెంటర్లో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం విస్సన్నపేట మండల కార్యదర్శి నాగరాజు, సిపిఎం పట్టణ కార్యదర్శి మేకల జ్ఞానరత్నం, సిఐటియు మండల కన్వీనర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆటల పోటీలకు ఎంపికలు

ప్రజాశక్తి-వత్సవాయి : పాఠశాల గేమ్స్ ఆధ్వర్యంలో ఈ నెల 8 ,9 తేదీల్లో మండల కేంద్రమైన జిల్లా పరిషత్ పాఠశాలలో క్రీడాకారులకు ఎంపికలు నిర్వహిస్తామని ఎంఈఓ ఎల్ నాగరాజు నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. 14-17 విభాగాల్లో ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాల నుంచి బాల, బాలికలు పోటీల్లో పాల్గొనవచ్చున్నారు. కబడ్డీ, కోకో, వాలీబాల్, సెటిల్, బాల్ బ్యాట్మెంటన్, యోగ, అథ్లెటిక్స్ విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈ నెల 8న జిల్లా పరిషత్ హైస్కూల్లో హాజరు కావాలని కోరారు.

సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: మండలంలోని కె.అగ్రహారం గ్రామానికి చెందిన 9 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.2 లక్షల రూపాయల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను మంగళవారం శాసన సభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) తమ నివాసంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజగోపాల్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం అత్యంత ముఖ్యమని, ఇలాంటి సహాయనిధులు అవసరమైన ప్రతి బాధితుడికి చేరేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుండ్ల కష్ణారావు, అనుమాల వేదాద్రి, గంగరాజు, అయ్యప్ప, ఆవుల సాయి, తదితరులు పాల్గొన్నారు.

కళ్లజోళ్లు పంపిణీ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: జయప్రద ఫౌండేషన్ చైర్మన్ తొండపు దశరథ జనార్ధన్ ఆధ్వర్యంలో గత నెలలో పట్టణంలో శ్రీ నాగలక్ష్మి అమ్మవారి దేవస్థానం వద్ద నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో 245 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో కంటి లోపములు గుర్తించి కళ్లజోళ్లు అవసరమైన 168 మందికి మంగళవారం టిడిపి సమన్వయ కమిటీ సభ్యులు నెట్టెం శివరాం, వైవిఎస్ రెడ్డి, వార్డు కౌన్సిలర్ పేదలాపురి సైదా, పట్టణ ఫౌండేషన్ కోఆర్డినేటర్ మైనేని రాధాకష్ణ, నియోజకవర్గ జయప్రద ఫౌండేషన్ కోఆర్డినేటర్ కట్టా వెంకట నరసింహారావు కళ్లజోళ్లు పంపిణీ చేశారు.

పౌష్టికాహారం అందజేత

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: కర్లపాటి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అక్టోబర్ మాసానికి రక్తహీనతతో బాధపడుతున్న చిన్నారులకు, నిరు పేద మహిళలకు, వయోవృద్ధులకు రూ.10 వేలు విలువైన పౌష్టికాహారాన్ని మంగళవారం అందజేసినట్లు ఆ సంస్థ వ్యవస్థాపకులు, ఎన్టీఆర్ జిల్లా రెడ్ క్రాస్ నిర్వహణ కమిటీ సభ్యులు కర్లపాటి వెంకట శ్రీనివాసరావు తెలిపారు. పట్టణంలో ట్రస్ట్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో శ్రేయస్సు సంస్థకు రూ.3 వేల ఆర్థిక సహాయాన్ని డాక్టర్ అనిల్ చేతుల మీదుగా అందజేశారు.

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలోని లిటిల్ ఏంజిల్స్ హైస్కూల్లో మంగళవారం సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్ అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన, పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో వ్యాసరచన మొదటి బహుమతి కె అమృత వర్షిని,ద్వితీయ బహుమతి జి పునీత్ సాయి, తృతీయ బహుమతి డి శ్రావ్యా శ్రీ, పెయింటింగ్‌లో మొదటి బహుమతి వి హర్షిని, ద్వితీయ బహుమతి ఎం వైష్ణవి, తృతీయ బహుమతి కె గీతాకష్ణవేణి అందుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు కేటి ఆచార్యులు, సులేమాన్, మౌనిక, ఆదిలక్ష్మి, పాల్గొన్నారు.

అత్యుత్తమ స్వచ్ఛ మున్సిపాలిటీగా నందిగామ

ప్రజాశక్తి- నందిగామ : నందిగామ మున్సిపాలిటీ జిల్లా స్థాయిలో అత్యుత్తమ స్వచ్ఛ మున్సిపాలిటీగా ఎంపికైంది. అత్యుత్తమ స్వచ్ఛ గ్రామ పంచాయతీలుగా ముప్పాళ్ల, చందర్లపాడు, అత్యుత్తమ స్వచ్ఛ విలేజ్ ఆర్గనైజేషన్స్‌గా తక్కెళ్లపాడు, నందిగామ, అత్యుత్తమ స్వచ్ఛ ఆసుపత్రులుగా నందిగామ, గొల్లమూడి పిహెచ్‌సిలు, స్వచ్ఛ అంగన్వాడీలుగా మాగల్లు, అత్యుత్తమ స్వచ్ఛ రెసిడెన్షియల్ స్కూల్‌గా అంబేద్కర్ గురుకులం, చందర్లపాడు మండలం ఎంపికైనట్లు అధికారులు తెలిపారు.

నటుడు శ్రీకాంత్ భరత్ క్షమాపణ చెప్పాలి

ప్రజాశక్తి - తిరువూరు : మహాత్మా గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన తెలుగు సినీ నటుడు శ్రీకాంత్ భరత్ వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని తిరువూరుకు చెందిన సామజిక కార్యకర్త, రచయిత ఎం రాంప్రదీప్ డిమాండ్ చేశారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ చరిత్రపై అవగాహన లేకుండా గాంధీ, అంబేద్కర్‌లను తరచుగా అవమానిస్తున్నారని, గాంధీపై చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకుని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ముప్పాళ్లకు స్వచ్ఛాంధ్ర అవార్డు

ప్రజాశక్తి-చందర్లపాడు: మండల పరిధిలోని ముప్పాళ్ళ గ్రామం జిల్లా స్థాయిలో స్వచ్ఛాంధ్ర అవార్డుకు ఎంపికైంది. డోర్ టు డోర్ వేస్ట్ కలెక్షన్, తడి పొడి చెత్త సేకరణ, వర్మీ కంపోస్టు తయారు చేయుట, గ్రామాన్ని శుభ్రం ఉంచడంలో ముప్పాళ్ళ గ్రామ పంచాయతీ అవార్డుకు ఎంపికవ్వడంపట్ల ఆ గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.



వ్యాయామం తప్పనిసరి

ప్రజాశక్తి-గంపలగూడెం: ప్రతి విద్యార్థి నిత్యం చదువుతోపాటు వ్యాయామం తప్పనిసరని సమగ్ర శిక్ష సైకాలజిస్ట్ ఉషా కిరణ్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని సత్యాలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సంద ర్శించారు. శారీరక ఆరోగ్యంతోపాటు మానసిక ఆరోగ్యం అత్యంత ఆవశ్యమని, అందుకు అవసరమైన ఆహార పదార్థాలను తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. హెచ్‌ఎం సతీష్ సూపర్ జిఎస్‌టి.. సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కల్పించారు.

మద్యం షాపుల్లో తనిఖీలు



వీరులపాడులో తనిఖీలు చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-వీరులపాడు : రాష్ట్రంలో కల్తీ మద్యం వెలుగుచూసిన నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వీరులపాడు, కంచికచర్ల మండలాల పరిధిలోని మద్యం దుకాణాల్లో మంగళవారం కంచికచర్ల ఎక్సైజ్ సీఐ అశ్ర ఉన్నిస బేగం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన మద్యం దుకాణాల్లో వేరే రాష్ట్రాలకు చెందిన మద్యాన్ని విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. **ప్రజాశక్తి-నందిగామ :**నందిగామలో బార్ అండ్ రెస్టారెంట్లు, మద్యం షాపులను నందిగామ ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ ఎ.రమాదేవి మంగళవారం తనిఖీలు చేశారు. కల్తీ మద్యం అమ్మకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని షాపుల యజమానులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ యుగంధర్, సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాలకు వేలం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: జగ్గయ్యపేట ఎక్సైజ్ పోలీసు స్టేషన్ పరిధిలో అక్రమ మద్యం తరలింపులో పట్టుబడిన వాహనాలను అధికారుల ఆధ్వర్యంలో మంగళవారం వేలంపాట నిర్వహించారు.వేలం ద్వారా వచ్చిన మొత్తాన్ని ప్రభుత్వ ఖజానాలో జమ చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

పేద విద్యార్థులకు మెరుగైన వైద్య విద్యే లక్ష్యం

మంత్రి కొల్లు రవీంద్ర




మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

మెడికల్ కాలేజీల గురించి జగన్ రెడ్డి అండ్ కో చేస్తున్న ఓవర్ యాక్షన్ హాస్యాస్పదంగా మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. స్థానిక రహదారులు భవనాల శాఖ అతిథి గృహంలో మంగళవారం నిర్వహించిన విలేఖర్ల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ జీవో నెం.107, 108, 133 ద్వారా ఎన్ఆర్ఐ కోటా, సెల్ఫ్ ఫైనాన్స్ కోటా ప్రకటించి, రూ.20 లక్షలు, రూ.15 లక్షల ఫీజు నిర్ణయించిందెవరో సమాధానం చెప్పాలని నిలదీశారు. ప్రజారోగ్యానికే కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. పేదలకు నాణ్యమై వైద్యం, పేద విద్యార్థులకు ఉచితంగా మెరుగైన వైద్య విద్య అందించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పని చేస్తోందన్నారు. తెలుగు రాష్ట్రాల్లో మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేసిందే స్వర్గీయ ఎన్టీఆర్, ఆ తర్వాత నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 28 మెడికల్ కాలేజీలు నిర్మించామని, పేదలకు వైద్య సదుపాయాలను చేరువ చేసే లక్ష్యంతో జీనోమ్ వ్యాలీ, మెడ్ టెక్ సిటీ ఘనత చంద్రబాబుదేనని అన్నారు. నిమ్స్, స్విమ్స్, బర్డ్ఆస్పత్రి, ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ ఎవరు ఏర్పాటు చేశారో గుర్తు చేసుకోవాలన్నారు. రాష్ట్రంలోని మెడికల్ కాలేజీలన్నీ పూర్తి చేసి 1750కి పైగా మెడికల్ సీట్లు విద్యార్థులకు అందిస్తామన్నారు.

10, 11 తేదీల్లో ఎలక్ట్రానిక్స్ ఎగ్జిబిషన్

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ ప్రచార కార్యక్రమాలలో భాగంగా ఈ నెల 10, 11 తేదీలలో ఎలక్ట్రానిక్ వస్తువులతో ఎగ్జిబిషన్ నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన సహాయ కలెక్టర్ ఫర్హీన్ జాహిద్ తో కలిసి కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ సమావేశపు మందిరంలో వాణిజ్య పన్నుల శాఖ అధికారులు, ఎలక్ట్రానిక్ వస్తువుల దుకాణాల యాజమాన్యాలతో సమావేశమై ఎగ్జిబిషన్ కార్యక్రమాలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ వస్తువులు గతంలోని ధరలకు, ఇటీవల జీఎస్టీ తగ్గింపుతో వచ్చిన ధరలను ప్రజలకు వివరించి అవగాహన కలిగించే విధంగా చూడాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జీఎస్టీ ప్రచార కమిటీ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్, జాయింట్ కమిషనర్ కల్పన, వాణిజ్య పన్నుల శాఖ అడిషనల్ కమిషనర్ బాలాజీ బాబు, అసిస్టెంట్ కమిషనర్ సౌమ్య, ఎలక్ట్రానిక్ దుకాణాల యజమానులు పాల్గొన్నారు.



ప్రభుత్వాసుపత్రిలో సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-చల్లపల్లి

స్థానిక కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రంలో వైద్యులు రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారని ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, సొసైటీ చైర్మన్ బొందలపాటి వీరబాబు అన్నారు. స్వచ్ఛ పిహెచ్ సిగా ఎన్నికై జిల్లా అవార్డు తీసుకున్న సందర్భంగా జనసేన ఆధ్వర్యంలో ఆసుపత్రి సూపరిండెంట్ శ్రీనివాస్, వైద్యులను, సిబ్బందిని సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో జనసేన నేతలు ఏపీ పూర్ణచంద్రరావు, సూదాని నందగోపాల్ చల్లపల్లి మండల జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శులు తోట మురళీకృష్ణ, మిరియాల జితేంద్ర పాల్గొన్నారు.

రీసర్వేను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-ఘంటసాల

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రీ సర్వే కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఘంటసాల తహసీల్దార్ బి.విజయప్రసాద్ రైతులకు సూచించారు. ఘంటసాల మండలం చినకళ్లేపల్లి గ్రామంలో రీ సర్వేపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. తొలుత గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రైతుల ప్రయోజనార్థం ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని, రీ సర్వే ప్రక్రియకు రైతులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రీ సర్వే డిటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: సైబర్ నేరాల నియంత్రణపై గుడ్లవల్లేరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు మంగళవారం ఎస్ఐ ఎన్.వి.వి.సత్యనారాయణ అవగాహనా కార్యక్రమాన్ని చేపట్టారు. జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఉత్తర్వులు మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టామని ఆయన చెప్పారు. సైబర్ సెక్యూరిటీ నేరాల తీరును వివరిస్తూ వీడియోలు స్క్రీన్‌పై విద్యార్థులకు చూపించారు. అలాగే మహిళల భద్రత, రహదారి భద్రత నియమాలను కూడా వివరించారు.

సిఎం చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి-మోపిదేవి: సిఎం చంద్రబాబు చిత్రపటానికి ఆటో డ్రైవర్లు పాలాభిషేకం నిర్వహించారు. మంగళవారం మోపిదేవి ప్రధాన కూడలిలో గ్రామ సచివాలయం సమీపాన ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చంద్రబాబు చిత్రపటానికి మండల టిడిపి అధ్యక్షులు నడకుదుటి జనార్దన్ రావు, సీనియర్ నాయకులు రావి నాగేశ్వరరావు ఆటో డ్రైవర్లతో కలిసి పాలాభిషేకం నిర్వహించారు ఈ కార్యక్రమంలో నాయకులు రావి రత్నగిరి, వేములపల్లి రవిచంద్ర, పుప్పాల ఏసు, నాదెండ్ల శరత్చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

కొరమీను సాగుతో అదనపు ఆదాయం

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): వ్యవసాయంతో పాటు అనుబంధంగా కొరమీను చేపల సాగు చేయడం వల్ల రైతులు అదనపు ఆదాయం పొందవచ్చని, ఆ దిశగా రైతులను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. జీవనోపాదుల మెరుగుదలపై జిల్లా కలెక్టర్, సహాయ కలెక్టర్ ఫర్హీన్ జాహిద్‌తో కలిసి మంగళవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ సమావేశ హాలులో జరిగిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ కొరమీను చేపలను తక్కువ స్థలంలోనే పెంచవచ్చని, మార్కెట్లో మంచి డిమాండ్ ఉండడంతో, తక్కువ పెట్టుబడితో లాభదాయకంగా ఉంటుందన్నారు. ఉదయ్ ఆక్వా కంపెనీతో ఒప్పందం చేసుకున్నామని, అవసరమైన సీడ్ సరఫరాతో పాటు మార్కెటింగ్ సౌకర్యం కల్పించడం జరుగుతుందన్నారు.

బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): మచిలీపట్నం నగరంలో అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని మంగళవారం స్వాధీనం చేసుకున్నట్లు పిడిఎస్ డిటిసి దుర్గంజనేయులు తెలిపారు. మచిలీపట్నం చింత చెట్టు సమీపంలో ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 400 బస్తాలు రేషన్ బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. కందుల జయబాబు అనే వ్యక్తి ఈ బియ్యాన్ని నిల్వ చేసినట్లు నిర్ధారించడం జరిగిందన్నారు. ఈ బియ్యం విలువ సుమారు తొమ్మిది లక్షల రూపాయలు విలువ ఉంటుందని పి డి ఎస్,డి టి తెలిపారు. విఆర్ఓ ఉమ కాంత్ ఆధ్వర్యంలో బియాన్ని సీజ్ చేయడం జరిగిందన్నారు.

ఆటోమోటివ్ ట్రేడ్‌పై ఇంటర్న్‌షిప్

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: మండలంలోని కౌతవరం జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు గుడ్లవల్లేరు శ్రీ లక్ష్మీ మెకానిక్ వర్క్స్‌లో ఆ సంస్థ అధినేత సిహెచ్.ఉపేంద్ర ఆటోమోటివ్ ట్రేడ్‌పై ఇంటర్న్‌షిప్ కార్యక్రమంలో భాగంగా టెన్త్ విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రాక్టికల్ శిక్షణ మంగళవారంతో ముగిసింది. సమగ్ర శిక్షా కార్యక్రమం కింద తమ 10వ తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఆటోమోటివ్ ట్రేడ్‌పై హెచ్ఎమ్ ఆదేశాలతో 10రోజుల ఇంటర్న్‌షిప్ నిర్వహించామని జీసీడీఓ ఒకేషనల్ ట్రైనర్ నిమ్మకూరి శ్రీనివాసరరావు తెలిపారు. ఈ ఇంటర్న్‌షిప్‌లో విద్యార్థులు ఆటోమొబైల్ రంగానికి చెందిన ప్రాథమిక సాంకేతిక నైపుణ్యాలను నేర్చుకున్నారని చెప్పారు.

ఎంవి కృష్ణారావుకు నివాళి

ప్రజాశక్తి-అవనిగడ్డ: దివిసీమ కీర్తి కిరీటం మండలి వెంకటకృష్ణారావు అని పలువురు వక్తలు కొనియాడారు. మంగళవారం అవనిగడ్డ వంతెన సెంటర్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి మండలి వెంకటకృష్ణారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో కృష్ణారావు విగ్రహానికి మాచవరం గ్రామానికి చెందిన కూటమి నాయకులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాచవరం గ్రామ సర్పంచ్ అప్పికట్ల లక్ష్మి, టిడిపి జనసేన గ్రామ అధ్యక్షులు కూరాకుల శివయ్య, కూరాకుల చంద్రశేఖర్, జనసేన మండల ఉపాధ్యక్షులు రెడ్ రౌతు కృష్ణబాబు, తెలుగు యువత మండల అధ్యక్షులు కూరాకుల శివప్రసాద పాల్గొన్నారు.

వరద బాధితులకు సరుకులు పంపిణీ

ప్రజాశక్తి-అవనిగడ్డ: విశ్వ ప్రగామి ట్రస్ట్ సహకారంతో పాత ఎడ్ల లంకకు చెందిన 450 కుటుంబాలకు రూ.10 లక్షల విలువైన నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. మంగళవారం అవనిగడ్డ బేతేలు సంఘం ఆధ్వర్యంలో వరద బాధిత కుటుంబాలకు పాస్టర్ పాల్ మేయర్, జార్జ్ ముల్లర్ ఆధ్వర్యంలో నిత్యవసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో విశ్వప్ర గామి ట్రస్ట్ మినిస్టర్ మోజెస్ బెన్ టిక్, మొదటి ఏరియా సౌత్ జోన్ మేనేజర్, జి స్టీఫెన్, ఏపీ స్టేట్ కోఆర్డినేటర్ జి సురేష్, అసిస్టెంట్ కోఆర్డినేటర్ పరంజ్యోతి, వై మధు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి ల్యాప్‌టాప్ బహూకరణ

ప్రజాశక్తి-చల్లపల్లి: ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న రఫీ ఘోరి ల్యాప్ టాప్ బహుకరించి సేవా గుణాన్ని చాటుకున్నారు. మోపిదేవి మండలం ఉత్తర్ల చిరువోలు లంకకు చెందిన దీప్మ సాయికావల్లి ఇంజనీరింగ్ మూడవ సంవత్సరం చదువుతోంది. పేదరికం వల్ల లాప్టాప్ కొనలేని పరిస్థితిలో ఉన్న విద్యార్థి విషయం తెలుసుకున్న రఫీ మాస్టారు విద్యార్థికి మంగళవారం చల్లపల్లి నారాయణ రావు నగర్‌లో ల్యాప్‌టాప్ బహుకరించారు.

ధాన్యం సేకరణపై శిక్షణ



ప్రజాశక్తి-కంకిపాడు: ఉయ్యూరు డివిజన్ పరిధిలోని ఏడు మండలాలకు సంబంధించిన అధికారులకు జిల్లా జాయింట్ కలెక్టరు అధ్యక్షతన పి.వి.పి. సిద్ధార్థ ఇంజనీరింగ్ కాలేజీ ఆడిటోరియంలో ధాన్యం సేకరణపై అవగాహన, సాంకేతిక శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. జిల్లా జాయింట్ కలెక్టరు నవీన్ మాట్లాడుతూ జిల్లాలో 287 రైతు సేవా కేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటుగా ధాన్యం సేకరణకు వినియోగించుటకు కావలసిన అన్ని పరికరాలు అందుబాటులో ఉంచడంతో పాటుగా సిబ్బంది నియామకం కూడా పూర్తి అయిందని తెలిపారు. ధాన్యం నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ప్రభుత్వం కల్పించిన కనీస మద్దతు ధర పొందేలా గ్రామస్థాయిలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు. ధాన్యం సేకరణ ప్రక్రియపై రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ అధికారి హేలా షాలోను, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ టి.శివరామప్రసాద్, జిల్లా పౌరసరఫరాల అధికారి మోహన్‌బాబు, జిల్లా వ్యవసాయ అధికారి పద్మావతి, జిల్లా సహాయ సహకార అధికారి చంద్రశేఖర్, అసిసింట్ డైరక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ పాల్గొన్నారు.

కలెక్టర్‌కు సత్కారం

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): స్వచ్ఛ పంచాయతీగా చల్లపల్లి రాష్ట్ర స్థాయిలో అవార్డు అందుకున్న సందర్భంగా జిల్లా పంచాయతీ డాక్టర్ జె.అరుణ, చల్లపల్లి సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, పంచాయితీ కార్యదర్శి పివి మాధవేంద్రరావు మంగళవారం కలెక్టరేట్‌లోని ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ డీకే బాలాజీని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీ అధికారి రజాఉల్లా, జిల్లా పంచాయతీ కార్యాలయ ఏ ఓ సీతారామయ్య, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



కార్మికునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-గుడివాడ: గుడివాడ 12వ వార్డు నైజాంపేట షాదిఖానా పక్కన నివాసముంటు ఆటోనగర్లో పెయింటర్‌గా పనిచేస్తూ ప్రమాదవశాత్తు గాయపడిన కార్మికుడు ఎస్‌కె అబ్బాస్ కుటుంబాన్ని పరామర్శించి రూ.10వేలు ఆర్థిక సహాయాన్ని ది గుడివాడ ఇండస్ట్రియల్ అండ్ ఆటోమొబైల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవ అధ్యక్షులు టి. లక్ష్మణరావు, అధ్యక్షులు అబ్దుల్ హ మీద్, ప్రధాన కార్యదర్శి అబ్దుల్ కుద్దుస్, ఉపాధ్యక్షులు బొబ్బరపల్లి ఆంజనేయులు, కోశాధికారి ఆత్మూరి విజయ్ కుమార్ పాల్గొన్నారు.

వడ్డే ఓబన్న వర్ధంతి

ప్రజాశక్తి-గుడివాడ : స్వాతంత్ర సమరయోధుడు వడ్డే ఓబన్న 179 వ వర్ధంతి సందర్భంగా గుడివాడలో బైక్ ర్యాలీ నిర్వహించారు. కోతి బొమ్మ సెంటర్ నుండి నాగవరప్పాడు, నెహ్రూచౌక్ సెంటర్ వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా వడ్డే ఓబన్న చిత్రపటానికి ఆంధ్రప్రదేశ్ వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర కమిటీ కోశాధికారి చంద్రగిరి శివ నాగమల్లేశ్వరరావు పూలమాల వేసి ఘన నివాళులర్పిచారు. ఈ కార్యక్రమంలో తమ్మిశెట్టి నాగ, బండారి వెంకటేశ్వరరావు, ఒప్పతల ఏడుకొండలు, తమ్మిశెట్టి లక్ష్మణరావు, బండి శీను తదితరులు పాల్గొన్నారు.




ఎఎన్ఎమ్ విద్యార్థులకు బహుమతులు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: జిల్లా స్థాయి తెలుగు క్విజ్‌లో గుడ్లవల్లేరు ఏఏఎన్ఎమ్ అండ్ వీవీఆర్ఎస్ఆర్ హైస్కూల్ విద్యార్థులు బహుమతులు సాధించారు. ఈ విషయాన్ని ఆ హైస్కూల్ డైరెక్టర్ నారాయణం శ్రీనివాసమూర్తి మంగళవారం తెలిపారు. విద్యార్థి వికాస వాహిని నిర్వహణలో భాగంగా మచిలీపట్నం హిందూ కళాశాల మహతి లలిత కళా వేదికగా 'కథ చెప్పడం ఎలా మరియు తెలుగు క్విజ్ పోటీలలో' తమ విద్యార్థులు పోటీ పడ్డారన్నారు. గెలుపొందిన విజేతలకు అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ప్రపంచ రచయితల సంఘం అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు, శతాధిక ఆరోగ్య గ్రంథ రచయిత డాక్టర్ జి.వి.పూర్ణచంద్ చేతుల మీదుగా బహుమతులను అందించారన్నారు.



అంగలూరు పాఠశాలకు స్వచ్ఛ అవార్డు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: మండలంలోని అంగలూరు బాలికోన్నత పాఠశాలకు జిల్లా స్థాయి స్వచ్ఛ అవార్డు లభించింది. ఈ విషయాన్ని ఆ హైస్కూల్ హెచ్ఎమ్ జి.జగన్మోహనరావు మంగళవారం విలేకరులకు తెలిపారు. మచిలీపట్నంలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో తనను జిల్లా ఇన్‌చార్జి మంత్రి సుభాష్, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు సన్మానించి, పురస్కారాన్ని అందించారని ఆయన చెప్పారు. ఈ అవార్డు తమ ఉపాధ్యాయులు, సిబ్బంది సంయుక్త కషి ఫలితమని జగన్మోహనరావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన్ను ఎంఈఓ-2 జి.గోపాలరావు అభినందించారు.



స్వచ్ఛత గ్రీన్ అంబాసిడర్‌గా భూషణం



ప్రజాశక్తి-కంచికచర్ల : కంచికచర్ల గ్రామ పంచాయతీలో శానిటరీ మేస్త్రిగా పనిచేస్తున్న బెజ్జం భూషణం ఎన్టీఆర్ జిల్లా స్థాయిలో బెస్ట్ స్వచ్ఛత గ్రీన్ అంబాసిడర్‌గా అవార్డు అందుకున్నాడు. మంగళవారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ, స్వచ్ఛ ఆంధ్ర చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరాం చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. 2025 స్వచ్ఛ ఆంధ్ర అవార్డులో భాగంగా, జిల్లా స్థాయిలో భూషణంకు ప్రశంసా పత్రాన్ని అందజేశారు.కంచికచర్ల గ్రామపంచాయతీ పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణపై అవార్డు పొందటంపై సర్పంచి వేల్పుల సునీత, కార్యదర్శి సుబ్రహ్మణ్యం భూషణంకి అభినందనలు తెలిపారు.

కౌన్సిల్ ఎజెండాపై మేయర్ సమీక్ష



ప్రజాశక్తి-విజయవాడ : విజయవాడ నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి వియంసిలోని తన చాంబర్లో మంగళవారం శాఖాధిపతులతో కౌన్సిల్ ఎజెండాపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కౌన్సిల్ ఎజెండా, అడిషనల్ ఎజెండాలో ఉన్న పలు ప్రతిపాదనలను శాఖధిపతులతో చర్చించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ బుధవారం జరిగే కౌన్సిల్ సమావేశంలో సభ్యులు అడిగే ప్రతి ప్రశ్నకు సరైన సమాధానం చెప్పే విధంగా ముందుస్తుగా సిద్ధం కావాలని కోరారు. సక్రమంగా, సజావుగా సమావేశం జరగడానికి వీలుగా అన్ని అంశాలు చర్చ జరిగే విధంగా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. నగరాభివద్ధి, ప్రజల సంక్షేమం కోసం సభ్యులు ఇచ్చిన ప్రతిపాదనలను అధికారులు అందరూ సహకరించాలని, ప్రజల కోసం విజయవాడ నగరపాలక సంస్థ ఎల్లప్పుడూ తోడుగా ఉండాలని అన్నారు. ఈ సమావేశంలో చీఫ్ ఇంజనీర్ ఆర్ శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, డిప్యూటీ కమిషనర్ రెవెన్యూ ఇంచార్జ్, ఎస్టేట్ ఆఫీసర్ ఎ శ్రీధర్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కే అర్జున్‌రావు, సూపరిండెంటింగ్ ఇంజనీర్లు పి.సత్యకుమారి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు సురేఖ, శ్రీనివాస్ రెడ్డి, సామ్రాజ్యం, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ చక్రవర్తి, అకౌంట్స్ ఆఫీసర్ బి సత్యనారాయణమూర్తి, స్టేట్ ఫైర్ ఆఫీసర్ నరేష్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి సోమశేఖర్ రెడ్డి, డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు 'సాల్వ్ ఫర్ టుమారో'

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ శామ్‌సంగ్, విద్యార్థుల కోసం ఆవిష్కరణ పోటీ సాల్వ్ ఫర్ టుమారో నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రతినిధి ఎస్.ఈశ్వర్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 2025లో 4వ ఎడిషన్ నుండి టాప్ 20 ఫైనలిస్ట్ జట్లను ప్రకటించనున్నట్లు తెలిపారు. ఫైనలిస్టుల్లో గ్రామీణ భారతదేశం, 12 రాష్ట్రాల్లోని ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల నుండి తెలివైన యువతీ యువకులు ఉన్నారని, ఇది మార్పు తెచ్చే యువతను తమ కమ్యూనిటీలలో విస్తత స్థాయి సమస్యలను పరిష్కరించడానికి సాంకేతికతను ఉపయోగించుకునేలా ప్రోత్సహించాలనే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఈ సంవత్సరం 14 ఏళ్ల వ్యక్తి ఫైనలిస్ట్‌గా అర్హత సాధించగా, అంతా బాలికలే ఉన్న బందం చివరి రౌండ్‌లోకి ప్రవేశించింది అన్నారు. ఈశాన్య ప్రాంతం నుండి రెండు జట్లు టాప్ 20లో చోటు దక్కించుకున్నాయన్నారు. గ్రాండ్ ఫినాలేలో, నాలుగు విజేత జట్లు ఐఐటీ డిల్లీలో ఇంక్యుబేషన్ కోసం శామ్‌సంగ్ నుండి సమిష్టిగా రూ.1 కోటి గ్రాంట్‌ను అందుకుంటాయని తెలిపారు.

సమిష్టి కృషితో దసరా ఉత్సవాలు విజయవంతం : కలెక్టర్

ప్రజాశక్తి - విజయవాడ : దసరా ఉత్సవాలను నిర్విఘ్నంగా నిర్వహించడానికి కారకులైన ప్రతి ఒక్కరికి ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ ధన్యవాదాలు తెలిపారు. దసరా నవరాత్రులను విజయవంతంగా ముగియడంపై అన్ని శాఖల అధికారులతో తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన సమావేశానికి కలెక్టర్ లక్ష్మీశ, నగర పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు, వియంసి కమిషనర్ ధ్యానచంద్ర ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... తొక్కిసలాటలు వంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరోధించడంలో సఫలమయ్యామని చెప్పారు. ఈసారి దసరా 11 రోజులు నిర్వహించామని, భక్తులు గత సంవత్సరం కంటే అధికంగా 16.5 లక్షలు వచ్చారని, అయినా ఎలాంటి ఇబ్బంది లేకుండా పూర్తి సమన్వయంతో దర్శన ఏర్పాట్లు చేశామని చెప్పారు. రాజశేఖర్ బాబు మాట్లాడుతూ... ఈ సంవత్సరం దసరా ఉత్సవాలకు బందోబస్తు ఏర్పాటు చేయడం తన 27 సంవత్సరాల ఉద్యోగ జీవితంలో ఎదుర్కొన్న అతిపెద్ద సవాలు అని చెప్పారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం వల్ల క్యూలైన్లు, పాసుల విషయంలో గతం కంటే మెరుగైన ఫలితాలు సాధించామన్నారు. పారిశుధ్య సిబ్బంది, ఇతర జిల్లాల నుంచి వచ్చిన పోలీసు సిబ్బంది అద్భుతంగా పనిచేశారని కితాబిచ్చారు. ధ్యాన చంద్ర మాట్లాడుతూ పూర్తి సమన్వయం ఉంటే అద్భుతాలు జరుగుతాయనడానికి ఈ ఉత్సవాల నిర్వహణే నిదర్శనమని తెలిపారు. కృష్ణా నదికి రెండవ ప్రమాద హెచ్చరిక జారీ చేసిన సమయంలో నిర్వహించిన ఈ దసరా ఒక కేస్ స్టడీగా నిలిచిపోతుందన్నారు. డీసీపీ సరిత మాట్లాడుతూ... ప్రణాళిక, సన్నద్ధత, అమలు మూడూ సక్రమంగా జరగటం వల్లే ఈ కార్యక్రమం విజయవంతమైందని తెలిపారు. ఈ సదర్భంగా దసరా ఉత్సవాలు విజయవంతం కావడానికి కృషిచేసిన అధికారులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు కె.చైతన్య, కే.మాధురి, కే.బాలకష్ణ, డిఆర్ఓ ఎం.లక్ష్మీ నరసింహ, అన్ని శాఖల జిల్లా అధికారులు, పాల్గొన్నారు.



అధికారులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

ఇగ్నో పరీక్ష ఫీజు గడువు పొడిగింపు

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం డిసెంబర్ 2025లో నిర్వహించే టర్మ్ ఎండ్ పరీక్షలకు ఆన్‌లైన్ ద్వారా చెల్లించే పరీక్ష ఫీజు గడువు తేదీని ఈ నెల 20వ తేదీ వరకు పొడిగించినట్లు ఇగ్నో ప్రాంతీయ కేంద్రం రీజినల్ డైరెక్టర్ డాక్టర్ కె.సుమలత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే 21 నుంచి 26వ తేదీ వరకు రూ.1100 ఆలస్య రుసుముతో ఆన్‌లైన్ ద్వారానే చెల్లించాలన్నారు. డిసెంబర్ సెషన్‌కు సమర్పించే అసైన్మెంట్ తేదీని కూడా ఈ నెల 31 వరకు పొడిగించినట్లు తెలిపారు. ఇతర వివరాలకు కొత్తపేటలోని హిందూ హైస్కూల్ ప్రాంగణంలో గల ఇగ్నో ప్రాంతీయ కేంద్రాన్ని స్వయంగా గాని లేదా 0866-2565253 ఫోన్ నెంబర్ ద్వారా సంప్రదించవచ్చని తెలియజేశారు.

వ్యర్థాలను వేర్వేరుగా సేకరించాలి

వియంసి కమిషనర్ ధ్యానచంద్ర

ప్రజాశక్తి-విజయవాడ : వ్యర్థాలను వేరు వేరుగా సేకరించాలని, వర్షపు నీటి నిల్వలు రోడ్డుపైన ఉండరాదని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. మంగళవారం ఉదయం తన పర్యటనలో భాగంగా లబ్బీపేట వాటర్ ట్యాంక్ రోడ్డు, విశాలాంధ్ర రోడ్డు, బి.ఆర్.టి.ఎస్ రోడ్డు, ఎన్‌ఆర్‌పి రోడ్డు, శివాలయం వీధి, భగత్‌సింగ్ రోడ్డు, చల్లపల్లి వారి వీధి, కేదారేశ్వరపేట, రామలింగేశ్వరపేట, లోటస్ ల్యాండ్మార్క్, సీకే రెడ్డి రోడ్డు, బుడమేరు వంతెన, దేవీనగర్ మెయిన్ రోడ్డు, మధురానగర్ ఆర్‌ఓబి, అయోధ్య నగర్ ప్రాంతాలని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇంటివద్దనే వ్యర్థాలను వేరు చేసి సేకరించాలని, తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి ప్రజల నుండి సేకరించాలని, వర్షపు నీటి నిల్వలు ఎక్కడ ఉంచరాదని, ఎప్పటికప్పుడు మొన్సూన్ రెస్పాన్స్ టీం అప్రమత్తంగా ఉంటూ నిల్వలను వాహనాల సహాయంతో తొలగించాలని, నగరంలో దోమలను నిర్మూలించేందుకు యాంటీ లార్వే ఆపరేషన్లు నర్వహిస్తూ ప్రజలకు దోమల వల్ల అటువంటి ఆరోగ్య సమస్యలు రానివ్వ కూడదని కమిషనర్ అన్నారు. అనంతరం అయోధ్యనగర్‌లో అన్న కాంటీన్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.



కెబిఎన్ ఎన్‌సిసి విద్యార్థుల ప్రతిభ



ప్రజాశక్తి - విజయవాడ సిటీ 17వ ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సిసి ఆర్మీ విభాగం ఆధ్వర్యంలో సెప్టెంబర్ 25 నుంచి అక్టోబర్ 4వ తేదీ వరకు ఉయ్యూరు శ్రీ విశ్వశాంతి హైస్కూల్‌లో నిర్వహించిన వార్షిక శిక్షణా క్యాంపులో వివిధ విభాగాలలో తమ విద్యార్థులు ప్రతిభ కనబరిచి పలు పతకాలు అందుకున్నారని కెబిఎన్ కళాశాల కార్యదర్శి డాక్టర్ టి.శ్రీనివాసు చెప్పారు. మంగళవారం కాలేజీలో నిర్వహించిన అభినందన సభలో ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 24 నుంచి పది రోజులపాటు జరిగిన శిక్షణ కార్యక్రమంలో తమ విద్యార్థులు ఫైరింగ్, మ్యాప్ రీడింగ్, డ్రిల్, యోగ, ఫీల్డ్ క్రాఫ్ట్, బాటిల్ క్రాఫ్ట్, సైబర్ సెక్యూరిటీ, ఫైర్ ఫైటింగ్, ప్రకృతి వైపరీత్యాలు అనే అంశాలలో ప్రతిభ కనబరచి బంగారు పతకాలు పొందారన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వంశీకృష్ణవేణి మాట్లాడుతూ తమ విద్యార్థిని కె స్రవంతి ఐజిసి ఆర్‌డిసికి ఎంపికైనట్లు చెప్పారు. కళాశాల ప్రెసిడెంట్ ఉసిరిక ఉమామహేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె రామకృష్ణ, పిఎల్ రమేష్ విద్యార్థులను అభినందించి బహుమతులు అందజేశారు.

వాల్మీకి మహర్షికి వియంసి ఘన నివాళి

ప్రజాశక్తి-విజయవాడ

వాల్మీకి మహర్షి జయంతి కార్యక్రమం నగరపాలకపాలక సంస్థలో మంగళవారం ఘనంగా జరిగింది. ముందుగా మహర్షి చిత్రపటానికి నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మీ, అధికారులు పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ వాల్మీకి జయంతి సందర్భంగా మనకు జీవిత పాఠాలను నేర్పిన రామాయణాన్ని గుర్తు చేసుకోవాలని అన్నారు. వాల్మీకి రచించిన రామాయణం.. మంచి మీద చెడు విజయం సాధిస్తుందన్న సందేశాన్ని అందిస్తుందని పేర్కొన్నారు. ఇది కేవలం ఒక కథ మాత్రమే కాదని, ధర్మం, నీతి, స్నేహం, కుటుంబ విలువలు నేర్పే ఒక అద్భుత పాఠంలా అందరి జీవితాలకు ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్ ఆర్ శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కే అర్జునరావు, పర్యవేక్షణ ఇంజనీర్ పి సత్యకుమారి, మేనేజర్ ప్రభావతి, సిబ్బంది పాల్గొన్నారు.

రికార్డ్ స్థాయిలో దుర్గగుడి హుండీ ఆదాయం

ప్రజాశక్తి- విజయవాడ సిటీ: రాష్ట్ర ప్రభుత్వం ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఈ ఏడాది దసరా ఉత్సవాలు వైభవంగా నిర్వహించింది. దసరా ఉత్సవాల్లో యాత్రికులు, భవానీలు వివిధ రూపాలలో దేవస్థానం హుండీలలో సమర్పించుకున్న కానుకలను ఈ సోమ, మంగళవారాల్లో లెక్కించారు. మల్లికార్జున మహా మండపంలోని ఆరో అంతస్తులో రెండు రోజులపాటు జరిగిన హుండీల లెక్కింపును దుర్గగుడి ఈవో శీనా నాయక్ పర్యవేక్షించారు. మొదటి విడత లెక్కింపులో భాగంగా 6న హుండీల 50 సంచులు తెరచి లెక్కించగా రూ.3,57,92,708 నగదు, 122 గ్రాములు బంగారం, 9.700 కిలోల వెండి లభించినట్లు దేవస్థానం వెల్లడించింది. వీటితోపాటు వివిధ దేశాల కరెన్సీ యాత్రికులు సమర్పించినట్లు పేర్కొంది. మంగళవారం హుండీల 56 సంచులు తెరచి లెక్కించగా రూ.6,73,02,813 నగదు, 265 గ్రాములు పసిడి, 9.750 కిలోల వెండి యాత్రికులు నుంచి కానుకల రూపంలో ఆదాయం వచ్చినట్లు తెలిపింది. రెండు రోజులకు హుండీ ఆదాయం నగదు రూపంలో రూ.10,30,95,521, బంగారం 387 గ్రాములు, 19.450 కిలోల వెండి లభించిన్నట్లు దేవస్థానం అధికారులు వెల్లడించారు. గతంలో కన్నా భిన్నంగా ఈ ఏడాది అమ్మవారి దర్శనం సందర్శకులకు శీఘ్రగతిన కల్పించాలని సంకల్పంతో రూ.500 టికెట్లను రద్దు చేసిన సంగతి తెలిసిందే. అదే మాదిరిగా ఉత్సవాల మూడో రోజు నుంచే యాత్రికుల రద్దీని దష్టిలో ఉంచుకొని రూ,100, రూ.300 టికెట్లు అమ్మకాలను నిలిపివేసిన దుర్గ గుడికి ఆదాయం తగ్గకపోగా గత యేడది కన్నా ఆదాయం పెరగడం విశేషం. 2024 దసరాలో హుండీల ఆదాయం రూ.9,32,94,018 నగదు లభించగా, ఈ ఏడాది దసరా లో రూ. 10,30,95,521 నగదును యాత్రికులు కానుకల రూపంలో సమర్పించుకోవడం జరిగింది. దుర్గగుడి కి గత ఏడాది కన్నా ఈ ఏడాది హుండీల ద్వారా అదనంగా కోటి రూపాయలు లభించినట్లు దేవస్థాన అధికారులు

